

విశాఖ డెయిరీపై సభా సంఘం ఏర్పాటు

- చైర్మన్‌గా జ్యోతుల నెహ్రూ

విశాఖ డెయిరీలో అవినీతి, అక్రమాలపై విచారణకు సభా సంఘం ఏర్పాటైంది. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం దీని కూర్పును ప్రకటించారు. సీనియర్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దీనికి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మరో ఆరుగురు ఎమ్మెల్యేలు సభ్యులుగా వుంటారు.

- వార్త మెయిన్ ఎడిషన్‌లో

అన్నదాతల్లో అలజడి

తుఫాన్‌గా బలపడిన తీవ్ర వాయుగుండం

- జిల్లా అంతటా మసుగు వాతావరణం
- అక్కడక్కడ చిరుజల్లులు
- నేడు, రేపు భారీ వర్షాల హెచ్చరిక
- వరి రైతులు ఆందోళన.. హడావుడిగా కుప్పలు



రావికమతం మండలం గర్నికంలో కుప్ప వేయడానికి వరి పనులు మోసుకెళుతున్న రైతులు

అనకాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం శుక్రవారం మధ్యాహ్నం తుఫాన్‌గా మారినట్టు వాతావరణ శాఖ వెల్లడించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమైంది. కొన్నిచోట్ల చిరుజల్లులు పడ్డాయి. దీంతో రైతుల్లో అలజడి మొదలైంది.

సాయంత్రం తరువాత శీతల గాలుల తీవ్రత పెరిగింది. కాగా తుఫాన్ హెచ్చరికలు, ఆకాశం మేఘావృతం కావడంతో వరి రైతులు గుబులు చెందుతున్నారు. గత మూడు, నాలుగు రోజుల్లో వరి పైరు కోత కోసిన పొలాల్లో పనలను కుప్పలు వేయడం మొదలుపెట్టారు. కొన్నిచోట్ల వరి పనలు పూర్తిగా ఎండకపోయినప్పటికీ వర్షం పడితే తడిసిపోతాయన్న ఉద్దేశంతో ఆదరాబాదరాగా కుప్పలు వేశారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిస్తే వరి కుప్పలు నీట మునిగే ప్రమాదం వుండడంతో కూలీలను ఏర్పాటు చేసికుని, ఎత్తు ప్రదేశాలో కుప్పలు వేస్తున్నారు. వర్షానికి తడవకుండా వుండడానికి కుప్పలపై టార్పాలిన్లు కప్పారు. కాగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో వరి కోతలను వాయిదా వేసుకున్న రైతులు.. తుఫాన్ ప్రభావంతో రానున్న 48 గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు వున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో వర్షం నీరు నిలువకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈదురు గాలులు వీస్తుండడంతో వరి పైరు నేల వాలుతున్నది. అధిక వర్షం కురిసి, పొలాల్లో నీరు నిల్వ వుంటే వరి పైరు కుళ్లిపోయే అవకాశం వుందని అంటున్నారు.



మాకవరపాలెంలో కోతకు వచ్చిన వరి పైరు

రెల్ల రాల్చు పురుగు బెడదతో హడావిడిగా కోతలు

ఇదిలావుండగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడి, తుఫాన్‌గా మారుతుందని నాలుగైదు రోజుల క్రితమే వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో వరి కోతలు వాయిదా వేసుకోవాలని, అప్పటికే కోత కోసిన పొలాల్లో వరి పనలను కుప్పలుగా వేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. అత్యధిక శాతం మంది రైతులు వరి కోతలను వాయిదా వేసుకున్నారు. అయితే చోడవరం, మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో వరి పంటను రెల్ల రాల్చు (కత్తెర) పురుగు ఆశించి విపరీతమైన నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో వరి కోతలు వాయిదా వేస్తే.. రెల్ల రాల్చు పురుగు ఉధృతి మరింత పెరిగి ఎక్కువ నష్టం వాటిల్లుతుందని భావించిన రైతులు బుధ, గురువారాల్లో కూడా వరి కోతలు కోశారు. శుక్రవారం ఆకాశం మేఘావృతం కావడంతో వరి పనలు పూర్తిగా ఎండకుండానే కుప్పలు వేస్తున్నారు.

ఇదిలా వుండగా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. మండల అధికారులు స్థానికంగా ఉండి అవసరమైతే సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌తోపాటు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను మరో రెండు రోజులపాటు కొనసాగించాలని నిర్ణయించారు.



నర్సీపట్నం పెద్ద చెరువులో వాటర్ స్పోర్ట్స్ గురించి స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి వివరిస్తున్న బలరామ్‌నాయుడు

నర్సీపట్నంలో వాటర్ స్పోర్ట్స్

పెద్ద చెరువులో ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రణాళిక

- స్పీకర్‌ను కలిసిన వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు
- సానుకూలంగా స్పందించిన అయ్యన్నపాత్రుడు
- త్వరితగతిన డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశం

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

స్థానిక పెద్ద చెరువుని వాటర్ స్పోర్ట్స్‌కి ఉపయోగించుకోవడానికి ప్రణాళిక రూపకల్పన జరుగుతున్నది. పెద్ద చెరువుని ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏపీ స్టేట్ వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బలరామ్ నాయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, ఇరిగేషన్ ఏఈ, ఆర్‌అండ్‌బీ అధికారులు, మునిసిపల్ కమిషనర్ శుక్రవారం ఇక్కడ స్పీకర్ అయ్యన్నపాత్రుడుని కలిశారు. పెద్ద చెరువులో వాటర్ స్పోర్ట్స్‌లో బోట్ రేసింగ్‌పై శిక్షణ ఇస్తే బాగుంటుందని బలరామ్‌నాయుడు ప్రతిపాదించారు. ప్రైవేటు భాగస్వామ్యంతో వాటర్ స్పోర్ట్స్‌లో డ్రాగన్ బోట్ రేసింగ్, పెడలింగ్ బోట్స్, కయాకింగ్, డైవింగ్, కానోయింగ్‌లో శిక్షణ ఇవ్వొచ్చని ఆయన తెలిపారు. రాష్ట, జాతీయస్థాయి జల క్రీడల పోటీల్లో పాల్గొనేలా యువతకు ఇక్కడ తర్ఫీదు పొందవచ్చని చెప్పారు. అడ్వంచర్ జోన్ కూడా ... మిగతా 8వ పేజీలో

ఉల్లంగనులపై విజిలెన్స్!

వైసీపీ హయాంలో రాయి క్వారీలు, క్రషర్లలో యథేచ్ఛగా అక్రమాలు

- కూటమి ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు
- నల్లరాయి క్వారీలు, క్రషర్లలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు
- వివరాలను వెల్లడించడంలో గోప్యత పాటిస్తున్న అధికారులు



రొంగలివానిపాలెంలో అనుమతి లేకుండా నడుపుతున్న నల్లరాయి క్వారీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నల్లరాయి క్వారీలు, క్రషర్లలో పెద్ద ఎత్తున జరుగుతున్న అక్రమాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. గురువారం పలు నల్ల రాయి క్వారీల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు.. ఈ తనిఖీలు కొనసాగుతాయని చెబుతుండడంతో అక్రమ క్వారీల నిర్వాహకుల వెన్నులో వణుకు మొదలైంది.

ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో నల్లరాయి క్వారీలు, క్రషర్లలో అక్రమాలు యథేచ్ఛగా సాగాయి. అనుమతులు లేకుండా క్వారీలు నిర్వహిస్తున్నప్పటికీ ఆ పార్టీ నేతలు చెప్పిందే వేదంగా భావిస్తూ గనులు, రెవెన్యూతోపాటు సంబంధిత నియంత్రణ శాఖల అధికారులు అక్రమ క్వారీలను కట్టడి చేయలేదు. ఇష్టారాజ్యంగా క్వారీలను ఏర్పాటు చేసి కొండలను పిండి చేశారు. నాడు జిల్లాకు చెందిన ఒక మంత్రి అనుచరులు, నల్లరాయి క్వారీలను తమ గుప్పెట్లో పెట్టుకుని అక్రమంగా వ్యాపారం చేసినట్టు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. స్థానికులు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.



మామిడిపాలెంలో ఒక క్వారీ నుంచి తరలిస్తున్న భారీ రాళ్లు

అనకాపల్లి మండలం మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, బవులువాడ, వూడేరు, తదితర గ్రామాల్లో క్వారీల నిర్వాహకులు అనుమతి పొందిన హద్దులను దాటి అడ్డగోలుగా తవ్వకాలు జరుపుతున్నారు. కుంచంగి, కూండ్రం, రొంలివానిపాలెం, సీతానగరం, మామిడిపాలెంలో కొంతమంది వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండానే క్వారీలను నిర్వహిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా నల్లరాయి క్వారీల్లో అక్రమాలు కొనసాగుతూనే వుండడాన్ని కూటమి పార్టీల నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో నల్లరాయి క్వారీల్లో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొద్ది రోజుల నుంచి క్వారీల్లో తనిఖీలు జరుపుతున్నారు. కానీ గోప్యత పాటిస్తూ తనిఖీల వివరాలను మీడియాకు వెల్లడించడంలేదు. కనీసం ఫిర్యాదు చేసిన వ్యక్తులకు కూడా చెప్పకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పేదల కష్టాలు తీర్చడానికి ప్రాధాన్యం

ప్రజాదర్బార్‌లో హోం మంత్రి అనిత

- ప్రజల నుంచి వెయ్యికి పైగా వినతులు



వృద్ధురాలి నుంచి అర్జీ స్వీకరించి సమస్యను తెలుసుకుంటున్న హోం మంత్రి అనిత



ప్రజాదర్బార్‌లో సమస్యలు విన్నవించుకోవడానికి బారులు తీరిన జనం

నక్కపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

పాయకరావుపేట నియోజకవర్గంలో పేదల కష్టాలు తీర్చేందుకు మీ ఇంటి ఆడబిడ్డగా మొదటి ప్రాధాన్యం ఇస్తానని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి శుక్రవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అన్ని మండలాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు వెయ్యికి పైగా వినతులను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తనకు అందించిన దరఖాస్తులను ఆయా శాఖలకు ... మిగతా 8వ పేజీలో

హామీలు సత్వరమే అమలు

- హోం మంత్రి వంగలపూడి అనిత
- అడ్డరోడ్డు-రామచంద్రపురం మధ్య రహదారి అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హోం మంత్రి అనిత

ఎస్.రాయవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని హోం మంత్రి వి.అనిత చెప్పారు. మండలంలో అడ్డరోడ్డు నుంచి కోటవురట్ల మండలం రామచంద్రపురం వరకు రూ.24.32 కోట్లతో చేపట్టనున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులకు శుక్రవారం దార్లపూడి వద్ద ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో తాము ప్రతిపక్షంలో వున్నప్పుడు ఈ రోడ్డు దుస్థితిపై పాదయాత్ర చేశానని, నాడు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టానని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీల్లో చిన్నపాటి రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు. దార్లపూడిలో పూర్తిగా దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును నెల రోజుల్లో అభివృద్ధి పరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, కూటమి పార్టీలనాయకులు గెడ్డం బుజ్జి, శివదత్, పోలిశెట్టి శ్రీను, అమలకంటి అబద్ధం, వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, తుంపాల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'రాగూర్' బాధితులకు కొనసాగుతున్న వైద్యసేవలు

- ఐసీయూలో 10 మంది, జనరల్ వార్డుల్లో 20 మందికి చికిత్స
- ఒకరి పరిస్థితి ఆందోళనకరం

పరవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

రాగూర్ ఫార్మా పరిశ్రమలో విష వాయువులు లీకైన ప్రమాదంలో అస్వస్థతకు గురైన వారిలో 30 మంది విశాఖ నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మొత్తం 32 మంది బాధితులకుగాను బుధ, గురువారాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతిచెందారు. మిగిలిన వారిలో పది మందిని ఐసీయూలో వుంచి చికిత్స అందిస్తుండగా 20 మందికి జనరల్ వార్డుల్లో చికిత్స కొనసాగుతున్నదని పరవాడ డిఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. వీరిలో చిన్నికృష్ణ పరిస్థితి ఆందోళనకరంగా ఉండగా, మిగతా వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆయన వెల్లడించారు.

వీఎంఆర్‌డీఏ ఎస్‌డీసీగా దయానిధి



దయానిధి

అనకాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):

జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) బలివాడ దయానిధి వీఎంఆర్‌డీఏ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నియమితులయ్యారు. వాస్తవానికి దయానిధిని గత నెలలోనే బదిలీ చేసిన ప్రభుత్వం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణరావును నియమించింది. అయితే కుమార్తె వివాహం వుండడంతో ఆయన బాధ్యతలు స్వీకరించలేదు. కాగా ప్రభుత్వం శుక్రవారం జరిపిన బదిలీల్లో దయానిధిని వీఎంఆర్‌డీఏ ఎస్‌డీసీగా నియమించింది. సత్యనారాయణరావు డిసెంబరు 5న అనకాపల్లి డీఆర్వోగా బాధ్యలు స్వీకరిస్తారు. అంత వరకు దయానిధి డీఆర్‌ఓగా కొనసాగుతారు.

గ్రామీణ రోడ్లకు కొత్త రూపు

శరవేగంగా చోడవరం- పీఎస్‌పేట రహదారి అభివృద్ధి పనులు

- పట్టణ పరిధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు
- మిగిలినచోట్ల తారు రోడ్డు నిర్మాణం
- పలు గ్రామాల ప్రజలకు త్వరలో తీరనున్న రవాణా కష్టాలు



చోడవరంలోని పీఎస్‌పేట రోడ్డులో జరుగుతున్న డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు

చోడవరం, నవంబరు 29:

ఐదేళ్ల నుంచి కనీస నిర్వహణ పనులకు నోచుకోక అత్యంత దారుణంగా తయారైన చోడవరం-పీఎస్‌పేట రహదారికి మంచి రోజులు వచ్చాయి. అడుగడుగునా భారీ గోతులతో అధ్వానంగా వున్న రోడ్డు రూపురేఖలు మార్చే పనులు మొదలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం శంకుస్థాపనతో సరిపెట్టిన ఈ రోడ్డు నిర్మాణ పనులు... కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే మొదలయ్యాయి.



చోడవరంలోని కొత్తూరు జంక్షన్ వద్ద అధ్వానంగా ఉన్న రహదారి (ఫైల్ ఫొటో)

చోడవరంలోని కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్‌పేట మీదుగా జన్నవరం వరకు రహదారిపై ఏర్పడిన భారీ గోతులతో పలు గ్రామాల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చోడవరంలోని కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్‌పేట వరకూ రోడ్డు దారుణంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే గోతుల్లో నీరు చేరి పంట కుంటలను తలపించేవి. గోతులు పూడ్చి రోడ్డును బాగు చేయాలని ఆయా పంచాయతీల ప్రజలు ఎన్నిసార్లు మొత్తుకున్నా నాటి వైసీపీ ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. అధికారులను అడిగితే.. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే తామేమి చేయగలమంటూ నిస్సహాయతను వ్యక్తం చేసేవారు. గత ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడతో, ఆటో డ్రైవర్లు శ్రమదానం చేసి గుంతలు పూడ్చారు. ఎట్టకేలకు సాధారణ ఎన్నికలకు కొద్ది నెలల ముందు వైసీపీ ప్రభుత్వం రూ.2.83 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించింది. అయితే గిట్టుబాటు కాదంటూ కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఈ నేపథ్యంలో ... మిగతా 8వ పేజీలో



సీఎం చంద్రబాబుకు నియోజకవర్గ సమస్యలను వివరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

చంద్రబాబును కలిసిన 'ప్రగడ'

ఎలమంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత, సీఎం నారా చంద్రబాబునాయుడును శుక్రవారం రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు కలిశారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్, నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు భర్తీ గురించి మాట్లాడడంతో పాటు 'ఎలమంచిలి'లోని ప్రధాన సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్టు నాగేశ్వరరావు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని గ్రామాలివే

అచ్యుతాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల్లో శనివారం ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ వైర్లపై వేలాడుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నందున చోడపల్లి, కొత్త మోసయ్యపేటల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లుతుందన్నారు.

అపరాలు పంటలపై రైతులు దృష్టిసారించాలి

రాంబిల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక దిగుబడులు ఇచ్చే అపరాల పంటల సాగుపై దృష్టి సారించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని మర్రిపాలెంలో శుక్రవారం ఆయన జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులుతో కలిసి రైతులకు అపరాల విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఇచ్చే చిరుధాన్యాలు, అపరాలు సాగుపై రైతులు దృష్టి పెట్టాలని కోరారు. రైతులందరూ విధిగా పంట బీమా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ మండల శాఖల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, బి.శ్రీరామదాసు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గౌరీపరమేశ్వరుల ఉత్సవం

ఎలమంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలో శనివారం గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు గౌరీ సేవా సంఘం సభ్యులు తెలిపారు. సాయంత్రం జరిగే పూజాది కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనవలసిందిగా కోరారు.

2, 3 తేదీల్లో దివ్యాంగుల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ఎస్.రాయవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ పారా సిట్టింగ్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 2, 3 తేదీల్లో పాయకరావుపేటలో రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కో-ఆర్డినేటర్ అన్నం గణేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే దివ్యాంగ క్రీడాకారులంతా ముందుగా ఫోన్ నంబరు 6305746978 కిసంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

బెల్టు దుకాణం వేలం నిర్వాహకుడిపై కేసు

ఎస్.రాయవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసూదిపురం గ్రామంలో మద్యం బెల్టు దుకాణం కోసం వేలం పాట నిర్వహించినట్టు అందిన సమాచారంపై శుక్రవారం వేలంలో పాల్గొన్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి, వేలం నిర్వహణకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల అభినందన సభ పోస్టర్ ఆవిష్కరణ

ఎస్.రాయవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడులో డిసెంబరు 2వ తేదీన పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే గురువే మన గమ్యం-ఉత్తమ అధ్యాపక, ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల అభినందన సభ పోస్టర్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్, ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల అధ్యక్షులు భద్రరావు, రమణ, సమన్వయకర్త సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, శివాజీ పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావంతో సాగని చేపల వేట

» ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని మత్స్యకారుల ఆవేదన



తుఫాన్ ప్రభావంతో పూడిమడక తీరానికే పరిమితమైన మత్స్యకారుల బోట్లు

అచ్యుతాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో చేపల వేట సాగక మూడు రోజుల నుంచి ఇళ్లకే పరిమితమైన పూడిమడక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల పాటు మత్స్యవేటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 20 వేల జనాభాతో అతిపెద్ద మత్స్యకార్ల గ్రామం పూడిమడక. వీరు ప్రతి రోజు పడవలపై చేపల వేటకు వెళ్తే తప్పా రోజు గడవదు. అటువంటిది గత మూడు రోజులుగా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వారు మత్స్యవేటకు వెళ్లలేదు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో తాము ఇళ్ల వద్దే ఉండిపోయామని, ఆదివారం అయితే సంద్రం మరింత తీవ్రతరంగా ఉండే అవకాశం ఉందని వారు అభిప్రాయ పడుతున్నారు. చేపల వేట లేకపోవడం వల్ల రోజు గడవడమే ఇబ్బందికరంగా ఉంటుందని మత్స్యకారులు వాపోతున్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ 'ఎలమంచిలి' ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు

రాంబిల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావులు పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మర్రిపాలెం శివారు రాజారాయుడుపాలెంలో రూ.ఆరు కోట్ల 90 లక్షలతో నిర్మించనున్న ఆర్అండ్‌బీ రోడ్డుకు వారు శంకుస్థాపన చేశారు. తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయన్నారు. విద్య, వైద్య, అభివృద్ధి రంగాలకు కూటమి ప్రభుత్వం



రాజారాయుడుపాలెంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సుందరపు విజయకుమార్, ప్రగడ నాగేశ్వరరావు

పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, రాంబిల్లి, అచ్యుతాపురం టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, బి.శ్రీరామదాసు, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు

ఎలమంచిలి: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో ఎలమంచిలి అగ్ర స్థానంలో అందరూ సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావు అన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ ఏటికొప్పాక, బయ్యవరం గ్రామాల్లో శుక్రవారం జరిగిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.ఐదు లక్షల ప్రమాద భరోసాగా ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొలుకులూరి విజయ్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి కె.చిరంజీవి, ఆర్.నారాయణమ్మ, ఇత్తంశెట్టి రాజు, జి.నాగేశ్వరరావు (శేషు), ఐటీడీపీ ఇన్‌చార్జి రాజాన వెంకునాయుడు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తిమ్మరాజుపేటలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

తిమ్మరాజుపేటలో వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన

మునగపాక, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): పలుచోట్ల వరిపంటలకు కత్తెర పురుగు, మనిపండు వంటి తెగుళ్లు సోకాయని ఆర్ఏఆర్ఎస్, కొండెంపూడికి చెందిన శాస్త్రవేత్తలు రమణమూర్తి, రాజ్‌కుమార్‌లు తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేటలో శుక్రవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల వరిపంటలను పరిశీలించారు. వీటిలో కొన్నింటికి కత్తెర పురుగు, మరికొన్నింటికి మనిపండు తెగుళ్లు సోకినట్టు గుర్తించామన్నారు. అసిఫెట్ లేదా క్లోరోఫైరిఫోస్ మందు వేపనూనెలో కలిపి పిచికారి చేయడం ద్వారా వీటిని నివారించవచ్చన్నారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సీహెచ్ జ్యోత్స్నకుమారి, సిబ్బంది, పాల్గొన్నారు.

తుప్పు పట్టిన భాగాన్ని తొలగించి కొత్తది వేస్తాం

ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్ట్ ఏఈ సుమ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మునగపాక, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డు బ్రిడ్జి వద్ద తుప్పు పట్టిన పైపు భాగాన్ని తొలగించి కొత్తది వేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు ఏఈ సుమ అన్నారు. ఈ నెల 25న 'తుప్పు పట్టిన వాటర్ పైపు లైన్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆమె శుక్రవారం పైపు లైన్‌ను పరిశీలించారు. తుప్పు పట్టిన భాగాన్ని తొలగించి, కొత్తది ఏర్పాటు చేసేందుకు 355 ఎంఎం ఐరన్ పైపు సిద్ధంగా ఉందన్నారు. అయితే కొత్తది ఏర్పాటు చేసేందుకు కొంత సమయం పడుతుందన్నారు. కాగా మునగపాక మెయిన్ రోడ్డు మదర్ థెరిసా విగ్రహం వద్ద పైపులైన్ ద్వారా వృథాగా నీరు వృథాగా పోతున్నట్టు గుర్తించి మరమ్మతులు చేశారు.



తుప్పు పట్టిన పైపులైన్‌ను పరిశీలించిన ఏఈ సుమ

వరి రైతుల్లో తుఫాన్ గుబులు

కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న వాతావరణం

కోటవురట్ల, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) వరి పంట పడిందనే ఆనందంలో ఉన్న రైతుల్లో తుఫాన్ గుబులు రేపుతోంది. పంటను ఇంటికి చేర్చే సమయంలో తుఫాన్ హెచ్చరికలతో వారి గుండెల్లో దడ పట్టుకుంది. దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో సగంపైగా రైతులు కోతలు కోశారు. శుక్రవారం సాయంత్రంవా యుగుండం ప్రభావం కారణంగా చిరుజల్లులు ప్రారంభం కావడంతో అలజడి రేగుతోంది. ప్రస్తుతం కోటవురట్ల మండలంలో 30 శాతం మాత్రమే రైతులు కోతలు కోసినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో వరి కోతలు కోయగా, మరికొన్ని గ్రామాల్లో కోయలేదు. పలుచోట్ల కోసి పనలను పంట చేలల్లోనే వదిలేశారు. దీంతో వరి పంట తీవ్రంగా దెబ్బ తింటుందని రైతులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి మబ్బులతో చల్లబడి చిరు జల్లులు పడడంతో వరికోత కోసిన రైతులు దిగాలు పడ్డారు. వాతావరణ శాఖ వరి పండినా కోతలు కోయవద్దని చెబుతున్నా, రెక్కరాల్చు పురుగు ఉధృతం కావడంతో పండిన పంట నేలరాలిపోతుందన్న బాధతో కొంత మంది రైతులు కోత కోసి మడుల్లోనే ఆరబెట్టారు. ఈ వర్షం అధికమైతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఏదేమైనా వరి పంట కోస్తే ఒక తంటా, కోయకపోతే మరో తంటా అన్నచందంగా తమ పరిస్థితి మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాజుపేటలో కోసిన వరి పనలను పొలంలోనే ఆరబెట్టిన దృశ్యం

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సింహాచలం

పాయకరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా యు.సింహాచలం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఆర్.దేవన్న మెడికల్ లీవ్ పెట్టడంతో కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడుగా పనిచేస్తున్న సింహాచలంకు ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన యు.సింహాచలంకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సన్మానం చేశారు.



ప్రిన్సిపాల్ సింహాచలంకి సత్కరిస్తున్న సిబ్బంది

జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

దేవరాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన కురమాన శ్రావణి జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైంది. ఈనెల 25, 26 తేదీలలో ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలలో శ్రావణి ప్రతిభను చాటింది. ఆమె ఆట తీరును గుర్తించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపిక కమిటీ ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసిందని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సీహెచ్.భువన మాధురి తెలిపారు. బాలికకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.కుమారి, సిబ్బందిని ఆమె అభినందించారు.

నిత్యావసర సరకుల వితరణ

ఎస్.రాయవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు గ్రామంలో శుక్రవారం ఇప్కో సమగ్ర రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో మైక్రో లెండింగ్‌లో భాగంగా పలువురు మహిళలకు జిల్లా ప్రాజక్టు ఆఫీసర్ ఎం.వెంకట్ నిత్యావసర సరకులు వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 56 వేల మహిళా బృందాలకు స్వయం ఉపాధి కల్పించామన్నారు. మహిళల ఉపాధికి ఉపయోగపడే వస్తు ఉత్పత్తికి శిక్షణ పరిశ్రమ స్థాపనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఉద్యోగులు కుమార్‌స్వామి, ఎం.లక్ష్మి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు నిత్యావసర సరకులు అందిస్తున్న దృశ్యం

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో నర్సీపట్నం గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. నవంబరు 14 నుంచి 17 వరకు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల గురుకుల పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి స్పోర్ట్స్, గేమ్స్ పోటీలలో 40 మంది విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి తెలిపారు. సీనియర్స్ విభాగంలో త్రో బాల్‌లో ప్రథమ స్థానం, వాలీబాల్‌లో ద్వితీయ స్థానం, జూనియర్స్ విభాగంలో వాలీబాల్‌లో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న ఎస్.శృతి వంద మీటర్ల పరుగులో స్వర్ణ పతకం, లాంగ్ జంప్‌లో రజత పతకం, 200 మీటర్ల పరుగులో రజత పతకం సాధించిందని తెలిపారు. జూనియర్స్ విభాగంలో 8వ తరగతి విద్యార్థినులు కె.హరిణి 400 మీటర్ల పరుగులో స్వర్ణ పతకం, ఎస్.గోపీమాధురి రజత పతకం, 200 మీటర్ల పరుగులో ఎం.కావ్య కాంస్య పతకం, 800 మీటర్ల పరుగు పోటీలో సీహెచ్.స్వర్ణ కాంస్య పతకం, 1500 మీటర్ల పరుగు పోటీలలో ఆరో తరగతి విద్యార్థిని ఎస్.దీన కాంస్య పతకం సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా పీడీ ఎన్.సావిత్రీదేవి, పీఈటీ కె.మల్లమ్మలను ప్రిన్సిపాల్ అభినందించారు.



సీహెచ్‌సీలోని వార్డును పరిశీలిస్తున్న పిల్లా రమాకుమారి

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి కృషి

మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

ఎలమంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి సందర్శించి ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. పలువురు రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించేందుకు వైద్యులు కృషి చేయాలన్నారు. ఆస్పత్రి వైద్యురాలు నిహారిక మాట్లాడుతూ ఆస్పత్రిలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో గదులు చాలక ఇబ్బందులకు తలెత్తుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నమ్మి రమణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులను నయం చేయడమే వైద్యుల లక్ష్యం: పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విమల



సంప్రదాయ వైద్య యోగ రత్నావళి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగం ఏదైనప్పటికీ వ్యాధిని నయం చేయడమే వైద్యుల లక్ష్యమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.విమలగిరి పేర్కొన్నారు. స్థానిక రాహుల్‌గాంధీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్య విజ్ఞాన సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సదస్సును తిరుపతికి చెందిన పారంపర్య వైద్య మహా సంఘం, మునగపాకకు చెందిన గురూజీ మూలికా వైద్య సమాఖ్య సంయుక్తంగా నిర్వహించాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ విమలగిరి గురూజీ మూలికా వైద్య సమాఖ్య ప్రతినిధి అలుగోలు ప్రసాదరావు రచించిన 'సంప్రదాయ వైద్య యోగ రత్నావళి పుస్తకాన్ని' ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రద్ధ, తపన, తాపత్రాయం ఉన్నవారు ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. పుస్తక రచయిత అలుగోలు ప్రసాదరావు మాట్లాడుతూ ఎంతో శ్రమించి మొదటి భాగం పుస్తక రచనను పూర్తి చేయడం జరిగిందని, త్వరలో రెండో భాగానికి రచనను ప్రారంభిస్తానన్నారు. కార్యక్రమంలో పారంపర్య వైద్య మహా సంఘం ప్రతినిధులు వి.బాలకృష్ణ, అలక రాజు, సుధారాణి, ఎల్.శ్రీనివాస్, తెలంగాణకు చెందిన యాత్రి మహర్షి, సజ్జన రమేశ్, అనకాపల్లి ఆయుష్ వైద్యాధికారి లావణ్య, తిరుపతి వైద్యాధికారి అలీ మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

ఎలమంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

మునగపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కంప్యూటరీకరణ, ఆధార్ అనుసంధానం పనులను వేగవంతం చేయాలని డీసీవో ప్రేమ స్వరూపారాణి ఆదేశించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని డీసీవోతో పాటు డీసీఏవో గోవిందరావులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సొసైటీలో జరుగుతున్న కంప్యూటరీకరణ పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక సొసైటీలో జరుగుతున్న లావాదేవీల గురించి ఆరా తీశారు. సొసైటీ సీఈవో ఆడారి వేణుగోపాల్, పెంటకోట మహేశ్, కోమలి ఆయా వివరాలను తెలియజేశారు.

హక్కుల గురించి అందరూ తెలుసుకోవాలి

మునగపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక హక్కుల గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ ఎం.ఆదిఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని వాడ్రాపల్లి దళిత కాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత కాలనీల్లో పౌర హక్కుల దినోత్సవం పేరుతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందరూ హక్కుల గురించి తెలుసుకోవడం ద్వారా ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, కూటమి నాయకుడు మళ్ల వరాహ నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

బీమా వాల్‌పోస్టర్ల ఆవిష్కరించిన మంత్రి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ రైతులకు అందజేస్తున్న రబీ బీమా పంటల వాల్‌పోస్టర్లను శుక్రవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, ఏవో ఉమాప్రసాద్ నేతృత్వంలో ఈ వాల్‌పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. తుఫాన్, కరువు, అకాల వర్షాలు, ప్రకృత వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే రైతులకు ఈ బీమా వర్తిస్తుందని చెప్పారు. జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా అధికారి మోహన్‌రావు మంత్రి అనితకు వివరించారు.

స్నేహితుడిని పరామర్శించిన 'ముద్రగడ'



కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభరెడ్డిని కలిసిన స్థానిక నాయకులు

పాయకరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ పాయకరావుపేటలో నివాసం ఉంటున్న తన స్నేహితుడు అర్జంపూడి లక్ష్మణరావును కాపు ఉద్యమనేత, మాజీ ఎంపీ ముద్రగడ పద్మనాభరెడ్డి పరామర్శించారు. శుక్రవారం పాయకరావుపేట వచ్చిన 'ముద్రగడ' పట్టణంలో లక్ష్మణరావును కలిసి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. అంతకుముందు వై జంక్షన్ వద్ద స్థానిక కాపు నాయకులు 'ముద్రగడ'కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు జగతా శ్రీనివాస్, జగతా శ్రీను, శ్రీధర్, వెంకన్నబాబు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్‌కు బహుమతి అందజేస్తున్న సీఐ వెంకటనారాయణ

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బస్సుల్లో ఉన్న పిల్లలను దృష్టిలో పెట్టుకుని డ్రైవర్లందరూ ఏకాగ్రతతో వాహనాలను నడిపి ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చూడాలని అనకాపల్లి ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ సూచించారు. స్థానిక సాయిశక్తి పాఠశాలలో బస్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని, అందువల్ల అందరూ రహదారి నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. అనంతరం పలువురు డ్రైవర్లకు బహుమతులు అందజేశారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపాల నుంచి వెంకుపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డులో అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్న ఓ వ్యక్తి నుంచి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. వెంకుపాలేనికి చెందిన పొలమరశెట్టి సూరిబాబు శుక్రవారం కెమికల్ ఫ్యాక్టరీ వద్ద మద్యం అమ్మకాలు సాగిస్తుండగా దాడి చేసి పది క్వార్టర్ బాటిళ్లను మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక ఆలయ సమీపంలోని కొబ్బరితోటల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయకుమార్ తెలిపారు. వీరి నుంచి రూ.2,430 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనకాపల్లిలో జంతు జనన నియంత్రణ కేంద్రం

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి సుంకరమెట్ట జంక్షన్ సమీపంలో జంతువుల జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బి.వి. రమణ తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన తెగ అరుస్తున్నాయ్.. కరుస్తున్నాయ్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి జెడ్సీ స్పందించారు. వీధి కుక్కల విషయమై జీవీఎంసీ వెటర్నరీ అధికారులతో శుక్రవారం చర్చించామన్నారు. కుక్కలను పట్టుకునేందుకు విశాఖ నుంచి సిబ్బంది రావడానికి సమయం పట్టే అవకాశాలున్నాయని వెటర్నరీ అధికారులకు వివరించామన్నారు. అందువల్ల అనకాపల్లిలోనే ఒక విభాగాన్ని ఏర్పాటు చేసి ఇక్కడ వీధి కుక్కలను పట్టుకుని ఆపరేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. సుంకరమెట్ట జంక్షన్‌లోని కమేళా వద్ద జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్య సమస్యలు: ఏఎంహెచ్‌వో

లంకెలపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను వినియోగిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, అందువల్ల అందరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలని గాజువాక జోనల్ ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్ అన్నారు. ప్లాస్టిక్ వాడకంపై శుక్రవారం స్థానిక కూడలిలో దుకాణదారులు, ప్రజలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగరంలో ప్లాస్టిక్ కవర్లు నిషేధించామన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, అందువల్ల అందరూ ప్లాస్టిక్ కవర్లకు బదులుగా క్లాత్, నారసంచులను వాడాలని కోరారు. దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 85, 79 వార్డుల శానటరీ ఇన్‌స్పెక్టర్లు సీతారామయ్య, కోటేశ్వరరావు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కశింకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాబర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా టీడీపీ కార్యకర్తలు పాల్గొని సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, సీహెచ్ కన్నయ్య, సీహెచ్ రాజు, బి.గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కాలువల సమస్యను పరిష్కరించాలి

కొత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ దేవీనగర్‌లో మురుగునీటి కాలువల నిర్మాణ సమస్యను పరిష్కరించాలని 60 మంది కాలనీ వాసులు అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవీనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధి కాలెపు రాజారావు మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా దేవీనగర్‌లో నివాసముంటున్నామని, మురుగునీటి కాలువలు లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దేవీనగర్‌లో పర్యటించాలని వారంతా ఆహ్వానించారు. త్వరలోనే ఎమ్మెల్యే కొణతాల పర్యటించి అభివృద్ధి పనులు చేపడతామని రాంకీ హామీ ఇచ్చారు.

చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

మాడుగుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు చెక్‌పోస్టు వద్ద విధులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి ఆదేశించారు. శుక్రవారం తాటిపర్తి పోలీసు చెక్‌పోస్టును ఆమె పరిశీలించారు. మైదాన ప్రాంతాలకు గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాకు తావివ్వకుండా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అన్ని వేళలా నిఘా పెట్టాలని సూచించారు. వాహనాల తనిఖీపై మరింత దృష్టిసారించాలని సిబ్బందికి ఆదేశించారు. ఇక్కడి సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. డీఎస్పీ వెంట మాడుగుల ఎస్‌ఐ నారాయణరావు ఉన్నారు.

విజృంభిస్తున్న దోమలు

- జ్వరాలు, వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన చెందుతున్న ప్రజలు
- మురుగు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని వేడుకోలు

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంలో దోమలు విజృంభిస్తున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇళ్లలోకి ప్రవేశిస్తుం డడంతో తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు దుర్భరంగా మారడంతో దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దోమలు స్వైరవిహారం చేస్తుం డడంతో జ్వరాలు, వ్యాధులు ప్రబలే ప్రమాదముందని జనం భయాందోళన చెందుతున్నారు. దోమల నియంత్రణకు లిక్విడ్ మిషన్లు, ఎలక్ట్రిక్ బ్యాట్‌లు, దోమల చక్రాలను వినియోగిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతుందని ఆవేదన చెందుతున్నారు. ప్రధాన కాలువల్లో రోజుల తరబడి పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే దోమల బెడద కాస్తయినా తగ్గే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడంతో పాటు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా దోమల బెడద నివారణకు పారిశుధ్య విభాగంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో దోమల నియంత్రణకు ఫాగింగ్ కూడా చేయిస్తున్నామన్నారు. కాలువలను పరిశుభ్రంగా తీర్చిదిద్దితే కొంతమేర దోమలను నియంత్రించవచ్చని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు.



కొబ్బరికాయల మార్కెట్ వద్ద చెత్తా చెదారంతో నిండిన కాలువ



రింగురోడ్డులో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ

అధికారులు చర్యలు చేపట్టాలి



దోమల నివారణకు జీవీఎంసీ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలు అనారోగ్యాల బారినపడుతు న్నారన్నారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగు, వ్యర్థాల తొలగింపునకు అధికారులు కృషి చేయాలి.

-మావూరి రవికుమార్, విజయరామరాజుపేట

కంటిమీద కునుకు ఉండడం లేదు..



పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో కంటిమీద కునుకు లేకుండా పోతుంది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నా దోమల బెడద తప్పడం లేదు. శీతాకాలం కావడంతో ఫ్యాన్ వేసుకుంటే చలి పెరుగుతుంది.. ఆపివేస్తే దోమకాటు బారిన పడుతున్నాం. మస్కిటో కాయల్స్, లిక్విడ్ వాడినా ప్రయోజనం ఉండడం లేదు. దోమల నివారణకు అధికారులే చర్యలు చేపట్టాలి.

-కొణతాల లక్ష్మి, గవరపాలెం



గొర్లివానిపాలెంలో పొలంలోనే గాలికుప్పలు పెట్టిన దృశ్యం



ఆదిరెడ్డిపాలెంలో రోడ్డు పక్కన గాలికుప్పలు పెడుతున్న రైతులు

అన్నదాతకు తుఫాన్ గుబులు

వరి పంట ఎక్కడ నీటిపాలవుతుందోనని ఆందోళన

సబ్బవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో చేతికి వచ్చిన వరి పంట నీటిపాలవుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారుల సూచనలతో రైతులు వరి కోతలు ఆపేసి, కోసిన పంటను మడులపైనే గాలికుప్పలుగా పెట్టుకుంటున్నారు. ముందుగా కోసి రైతులు కళ్లాలకు చేర్చుకోగా, రెండు రోజులు క్రితం కోత కోసిన రైతులు మల్లపైనే కుప్పలుగు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఈ ఏడాది మండలంలోని 3,200 ఎకరాల్లో వరి నాట్లు వేయగా పంట దిగుబడులు ఆశాజకంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా సుమారు 20 శాతం మేర కోతల జరిగాయని ఏవో పోతల సత్యనారాయణ తెలిపారు. డిసెంబరు రెండు తర్వాత రైతులు పంట కోతలు మొదలు పెట్టకోవాలని సూచించామని పేర్కొన్నారు.

కేడీ పేట పోలీస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసలు

అనకాపల్లి-రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కేడీ పేట పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం ప్రశంసించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఓ కారులో రూ.12 లక్షల 50 వేల నగదుతో ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి గంజాయి కొనాలని ప్రయత్నించారు. పోలీసుల నిఘా అధికంగా ఉండడంతో ఎక్కువ మోతాదులో గంజాయి రవాణా చేయలేమని భావిస్తూ 25 కిలోల గంజాయిని రూ.లక్షా 25 వేలకు కొనుగోలు చేశారు. దారి ఖర్చులు పోనూ మిగిలిన రూ.11 లక్షల ఆరు వేలను ఎవరికీ అనుమానం రాకుండా బ్యాగ్‌లో పెట్టి తమ కారు ఇంజన్ భాగంపైన బోనెట్ కింద అమర్చి, గంజాయిని కారు వెనక డిక్కీ అడుగు భాగంలో పెట్టి బయలుదేరారు. రొంపుల ఘాటీ నుంచి తనిఖీలు తక్కువ ఉంటాయని భావించి వారు రాజమండ్రి వైపు వెళ్తుండగా కేడీ పేట, అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న కేడీ పేట పోలీసులు వీరిని పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి పట్టుకోవడంతో పాటు అత్యధికంగా నగదును సీజ్ చేసిన కేడీ పేట ఎస్‌ఐ తారకేశ్వరరావు, సిబ్బంది విశ్వేశ్వరరావు, ఆంజనేయులు, అప్పారావు, చిరంజీవి, సతీశ్, గోవిందరావు, నాయుడులను ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అభినందించారు.



పోలీస్ స్టేషన్ సిబ్బందితో ఎస్పీ తుహిన్‌సిన్హా

రోడ్డు ప్రమాదాల్లో మరణాల నివారణకు హెల్మెట్ ధారణ తప్పనిసరి

మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కేసులు

ట్రాఫిక్ చలాన్లు మూడు కంటే ఎక్కువ ఉంటే వాహనాలను సీజ్ చేస్తాం

జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో మరణాల నివారణకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ ఏడాది అనకాపల్లి జిల్లాలో ద్విచక్ర వాహనాల ప్రమాదాల కేసులు 103 నమోదవ్వగా, ఆయా ప్రమాదాల్లో 104 మంది మృతి చెందారన్నారు. 35 మంది క్షతగాత్రులయ్యారన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్లే ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో వీరు మృతి చెందారన్నారు. జిల్లాలో ద్విచక్ర వాహనాల ప్రమాదాలు తగ్గుముఖం పట్టేందుకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని పోలీసులకు ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు.

మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపినా, త్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో ప్రయాణించినా, హెల్మెట్ ధరించి క్లిప్ పెట్టకపోయినా, ఐఎస్‌ఐ మార్కు హెల్మెట్ వినియోగించకపోయినా, ప్రిలియన్ రైడర్ (వెనక కూర్చున్న వ్యక్తి) తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ఆయా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ చలాన్లు మూడు కంటే ఎక్కువ ఉండి, అవి చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేసి జరిమానా చెల్లించిన తర్వాతే వాహనాన్ని ఇవ్వడం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

గీత కార్మికుల సంక్షేమ నిధికి రూ.5 వేల కోట్లు కేటాయించాలి

కశింకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సంక్షేమ నిధి కింద రూ.ఐదు వేల కోట్లను ప్రభుత్వం కేటాయించాలని రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్లపాలెం కల్లుగీత కార్మికుల సంఘం సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గీత కార్మికులకు 20 శాతం రిజర్వేషన్ పెంచి మండలానికి ఒక మద్యం షాపును కేటాయించాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ద్వారా రూ.10 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. అంతేకాకుండా కులవృత్తి చేస్తున్న వారికి సొసైటీలో సభ్యత్వం, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గీత కార్మిక సంఘాల నేతలు కట్టా ఈశ్వరరావు, పొలుసు మహలక్ష్మినాయుడు, దమ్ము జాన్, తుట్టా అప్పారావు, చప్పిడి ఆంజనేయులు, పిల్లి అప్పారావు, దుంగా సత్యనారాయణ, మోహన్, సతీశ్, బాబూరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో విశాఖ ఫార్మా ఎండీ లాల్‌కృష్ణ తదితరులు

విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేత

పరవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాంకీ ఫౌండేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా ఫార్మాసిటీ నిర్వాసిత గ్రామాలకు చెందిన 130 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు రూ.12.99 లక్షలను కేటాయించింది. ఇందుకు సంబంధించిన చెక్కులను శుక్రవారం రాంకీ కమర్షియల్ హబ్‌లో విశాఖ ఫార్మా ఎండీ పీపీ లాల్‌కృష్ణ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు ఏటా రాంకీ ఫౌండేషన్ ఉపకార వేతనాలు అందజేయడం అభినందనీయమన్నారు. రాంకీ గ్రూప్ సీఈవో వాసుదేవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంవీ రామిరెడ్డి, విశాఖ ఫార్మా డీజీఎం గిరిధర్ భక్షి, ఏజీఎం రాఘవరెడ్డి, ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గవరపాలెంలో ఘనంగా లక్ష పత్ర పూజ

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి గవరపాలెం భోగలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాస శివ రాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మండపంలో లక్ష పత్ర పూజను ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. అలాగే గోపూజ నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి శాంతి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి భోగలింగేశ్వరుని, సర్వకామదాంబ అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. స్వామివారికి లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు తగిన చర్యలు చేపట్టారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న పీలా గోవింద

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కశింకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపాలెం గ్రామంలో వాలీబాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏపీయుఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణలు పాల్గొని వాలీబాల్ పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంటా యువసేన ఆధ్వర్యంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో భాగంగా వారోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, నాయకులు ఎన్.రమణారావు, బి.గంగయ్య, నూకునాయుడు, తదితరలుఉ పాల్గొన్నారు.

'ఫార్మా' బాధితులకు కొనసాగుతున్న వైద్య సేవలు

ఒకరి పరిస్థితి ఆందోళనకరం

పరవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఠాగూర్ ఫార్మా పరిశ్రమలో విష వాయువు లీకైన ప్రమాదంలో అస్వస్థతకు గురై 30 మంది విశాఖ నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మొత్తం 32 మంది అస్వస్థతకు గురవ్వగా, వీరిలో బుధ, గురువారాల్లో ఇద్దరు మృతి చెందారు. మిగతా వారిలో పదిమంది ఐసీయూలో, 20 మంది జనరల్ వార్డుల్లో చికిత్స పొందుతున్నారని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. అయితే వీరిలో చిన్నికృష్ణ అనే కార్మికుని పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు.

ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

లంకెలపాలెంలో సీఐటీయూ రాస్తారోకో



రాస్తారోకోలో భాగంగా నినాదాలు చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

పరవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని ఠాగూర్ ఫార్మా పరిశ్రమలో విష వాయువులు లీకైన ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం లంకెలపాలెం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఫార్మాసిటీకి ఉద్యోగులతో వెళ్తున్న బస్సులను అడ్డగించి నాయకులు, కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరో 27 మంది ఆస్పత్రి పాలయ్యారన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, ఫార్మా పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటరావు, సత్తిబాబు, శ్రీను, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

సబ్బవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేఆర్ పురం, సత్తెనపల్లి గురుకుల పాఠశాలల్లో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ ఐసీటీ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానం, క్రాఫ్ట్ వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానంలో తమ విద్యార్థులు నిలిచారని ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎం.అశోక్, డి.విశ్వనాథ్, ఎల్.మున్నా, జె.సంపత్, వినయ్‌తో పాటు గైడ్ టీచర్లు డాక్టర్ టి.రాంబాబు, డి.నానాజీలను శుక్రవారం నక్కపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత అభినందించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఖోఖో పోటీల చాంపియన్ ఏఎంఏఎల్ కళాశాల



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయబాబు, తదితరులు

కొత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 28, 29 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఖోఖో పోటీల్లో ఏఎంఏఎల్ కళాశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు తెలిపారు. దీంతో పాటు సౌత్ జోన్ నేషనల్‌కి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన కె.శ్రీనివాస్, బి.ప్రసాద్, శశికుమార్, పి.గౌతమ్, సాయిసురేంద్ర భానులను కాలేజీ అధ్యక్షుడు కేఎస్ఎన్ మంగరాజు, కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్, గవర్నమెంట్ బాడీ మెంబర్లు కె.రమేష్, సూపరింటెండెంట్ అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ నాయుడు, కోచ్ ఎ.నూకయ్య తదితరులు అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలపై మైనర్లకు కౌన్సెలింగ్



మైనర్లు, వారి తల్లిదండ్రులకు సూచనలిస్తున్న సీఐ వెంకట నారాయణ

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మోటార్ వాహన చట్టం నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 20 మంది మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులకు పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపడం నేరమని, ఏదైనా ప్రమాదం జరిగితే గాయపడిన వారి కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలన్నారు. తల్లిదండ్రులు కూడా మైనర్లు అయిన తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు.

ఇటీవల జలగలమదుం జంక్షన్ వద్ద ఒక బాలుడు ద్విచక్ర వాహనాన్ని వేగంగా నడిపి ఆగివున్న లారీని ఢీకొని మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు ఎంతగా రోదించారో వివరించారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా తల్లిదండ్రులు చూసుకోవాలని ఉద్బోధించారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపిన 20 మందికి ఒక్కొక్కరికి రూ.535 చొప్పున జరిమానా విధించామని సీఐ పేర్కొన్నారు.

శ్రమదానంతో రహదారి నిర్మాణం


రహదారి నిర్మాణంలో గిరిజనులు

గూడెంకొత్తవీధి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి పంచాయతీ చిన్నగొంది గ్రామానికి చెందిన ఆదివాసీలు శ్రమదానం చేసి రహదారిని నిర్మించుకున్నారు. గోనుగుమ్మలు నుంచి చిన్నగొంది గ్రామం వరకు కేవలం కాలిబాట మాత్రమే ఉన్నది. దీంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. తమ గ్రామానికి రహదారి నిర్మించాలనిగత వైసీపీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ప్రస్తుతం ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకి పలు మార్లుఆదివాసీలు వినతి పత్రాలు ఇచ్చారు. వారి హామీలు కాలేదు. దీంతో చిన్నగొంది గ్రామానికి చెందిన గిరిజనులు 20రోజులపాటు శ్రమించి శుక్రవారం నాటికి మూడు కిలోమీటర్ల రహదారిని పూర్తి చేశారు. ఈ నిర్మాణాన్ని ఉపాధి పథకంలో చేర్చి గిరిజనులకు కూలి చెల్లించాలని గ్రామ పెద్దలు భాస్కరరావు, కేశవరరావు అధికారులను కోరారు.

'పోషకాహారం లోపంతోనే విద్యార్థులు మృతి'


విద్యార్థిని మృతిపై ఆరా తీస్తున్న దండకారణ్య ఉద్యోగ సమితి సభ్యుడు మాణిక్యం

అరకు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థులకు సరైన పోషకాహారం అందక, వసతుల లేమితో బాధపడుతూ అనేక మంది చిన్నారులు మృతి చెందుతున్నారని దండకారణ్య ఉద్యోగసమితి కేంద్రకమిటీ సభ్యుడు సమరెడ్డి మాణిక్యం ఆరోపించారు. గురువారం యండపల్లివలస గురుకులంలో చదువుతున్న ఆరో తరగతి విద్యార్థి జన్ని ప్రియాంక మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన చిన్నారి మృతికి గల కారణాలను విద్యార్థులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దండకారణ్య రాష్ట్ర సమితి మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.కామేశ్వరరావు, డీఎల్‌వో జిల్లా అధ్యక్షుడుకొండపల్లి కాంతారావు, ఉపాధ్యక్షుడు కొర్రా ప్రసన్నకుమార్, జిల్లా కార్యదరి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం: ఏఈ


పక్కా గృహాల నిర్మాణాలకు మార్కింగ్ ఇస్తున్న హౌసింగ్ ఇంజనీర్లు

గూడెంకొత్తవీధి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని స్థానిక హౌసిగ్ ఏఈ సూరిబాబు తెలిపారు. శుక్రవారం జర్రెల పంచాయతీ కేంద్రంలో పీఎం జన్‌మన్ పక్కా గృహాల నిర్మాణాల గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ గ్రామంలో 50 గృహాల నిర్మాణాలను ప్రారంభించామన్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వివిధ దశల్లో నగదు చెల్లింపులు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ పడాల్ పాల్గొన్నారు.

డీఈఈ జీఆర్‌హెచ్ రాజు సేవలు భేష్

చింతపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలో ఐదేళ్ల పాటు డీఈఈగా పనిచేసిన జీఆర్‌హెచ్ రాజు సేవలు అభినందనీయమని ప్రస్తుత డీఈఈ జి. కరుణ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో బదిలీపై అనంతగిరి వెళ్లిన రాజును ఇంజనీరింగ్ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా డీఈఈ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సుదీర్ఘకాలం పనిచేయడం వల్ల ఆదివాసీలతో మంచి సత్సంబంధాలు కలిగిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారన్నారు. గిరిజన ప్రజలకు తాగునీటి అందించారన్నారు. సన్మాన గ్రహీత రాజు మాట్లాడుతూ చింతపల్లిలో విధులు నిర్వహించడం సంతృప్తి కలిగించిందన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కల్యాణ్ రామ్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రాజుపాకలులో లంబసింగి ఎఫ్‌పీవో స్టాల్

చింతపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాకలు గ్రామం వద్ద లంబసింగి ట్రైబల్ ప్రొడక్ట్స్ రైతు ఉత్పత్తిదారుల సంఘం తయారు చేసిన విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్ ఐఐఎంఆర్ సహకారంతో ఏర్పడిన లంబసింగి ఎఫ్‌పీవో గిరిజన రైతుల వ్యవసాయఉత్పత్తులతో పలు విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈస్టాల్‌లో పనస బిర్యానీ మసాల, పచ్చడి, ఇన్‌స్టాంట్ కాఫీ పొడి, అనాస జామ్, జ్యూస్, టమాటా పచ్చడి, చిరుధాన్యాల ఆహార ఉత్పత్తులు, తేనె, సబ్బులు విక్రయిస్తున్నట్టుఎఫ్‌పీవో డైరెక్టర్లు రూతురాణి, ఇందిర తెలిపారు.


ముంచంగిపుట్టు మండలం లుంగాపుట్టులో టార్పాలిన్ల రక్షణలో వరి కుప్పలు


రైతులకు సూచనలిస్తున్న కొయ్యూరు ఏవో ఉమాదేవి

అన్నదాతల్లో తుఫాన్ గుబులు

ముంచంగిపుట్టు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ గిరి రైతులను భయపెడుతోంది. తీవ్ర వాయుగుండం తుఫాన్‌గా మారడంతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు కోసిన చేనును భద్రపరిచే పనుల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే మండలంలో పలు చోట్ల వరి కోతలు పూర్తయ్యాయి. తుఫాన్‌కు తడిచిపోయే అవకాశం ఉండడంతో వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్నారు. కొన్నిచోట్ల వరి, సామలు, రాగుల పనలు పొలాల్లో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం పలు చోట్ల తేలికపాటి చిరుజల్లుతో నిలిచిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలకు పంట ఎక్కడ పాడైపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఐటీడీఏ ద్వారా రాయితీపై కనీసం టార్పాలిన్లు సైతం అందించడంలేదని, మార్కెట్‌లో వేలాది రూపాయలు వెచ్చించి వాటిని కొనుగోలు చేస్తున్నామని రైతులు తెలిపారు. కొంతమంది టార్పాలిన్లు కొనే స్తోమతలేక వరి చేనును పొలాల్లోనే వదిలేస్తున్నారు. అధికారులు స్పందించి రాయితీపై టార్పాలిన్లు అందించాలని రైతులు కోరుతున్నారు.

చింతపల్లి, జీకేవీధి మండలాల్లో ముసురు

గూడెంకొత్తవీధి/చింతపల్లి: చింతపల్లి, జీకేవీధి మండలాల్లో ముసురు వాతావరణం నెలకొన్నది. తుఫాను ప్రభావం వల్ల శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు, మోస్తరు వర్షం కురుస్తున్నది. వర్షం వల్ల పెదవలస వారపు సంతలో వర్తకులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. వరి కోతలకు అంతరాయం కలిగింది.

రైతులు జాగ్రత్తలు పాటించాలి: ఏవో ఉమాదేవి

కొయ్యూరు: తుఫాన్ ప్రభావానికి రైతాగం అప్రమత్తంగా ఉండాలని, వరి కోతలు వాయిదా వేయాలని వ్యవసాయ అధికారి ఉమాదేవి సూచించారు. మండలంలోని శుక్రవారం రేవళ్ల సచివాయ పరిధిలో పర్యటించారు. వరి పొలాలను సందర్శించి పరిశీలించారు. ముడు రోజుల తుఫాన్ ప్రభావ ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈబడుగు రమేశ్, సిబ్బంది ఉష తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

గురుకులాల ఉద్యోగుల సంఘు అధ్యక్షుడు కొండబాబు


ర్యాలీలో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు

పాడేరురూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.కొండబాబు, ఎన్.వెంకటేశ్వర్లుడిమాండ్ చేశారు. గురుకులాల అవుట్ సోర్సింగ్ టీచర్స్ అండ్ లెక్చర్స్ తమ సమస్యలపై నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ శిబిరం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, గురుకులాల్లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్య పరిష్కారమయ్యేంత వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో మూడేళ్ల నుంచి అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉపాధ్యాయులను గత ప్రభుత్వం కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్పు చేసి, 15 ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న తమకు అన్యాయం చేసిందన్నారు. ఈ స్థితిలో తమను అవుట్ సోర్సింగ్ నుంచి సీఆర్టీలుగా మార్పు చేయాలని కోరారు.

కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

హుకుంపేట నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి తిగలవలస పంచాయతీ బిజ్జపల్లి గ్రామంలో జోయ్ మినిస్ట్రీస్ ఆఫ్‌దీగా స్పెల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిక్షణను స్థానిక సర్పంచి బెను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మహిళలు టైలరింగ్ శిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు, సంస్థ ప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'కలెక్టర్ సమక్షంలో విచారణ చేపట్టాలి'


చినకోనేల గ్రామంలో విచారణకు వెళ్లిన తహసీల్దార్

అనంతగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ బూరిగ, చినకొనేల గ్రామాల్లో 71 కుటుంబాలకు చెందిన 108 ఎకరాలను భూస్వాములు పేరిట రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంపై కలెక్టర్, సబ్ కలెక్టర్‌ల సమక్షంలో విచారణ చేపట్టాలని ఆయా గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ భూముల రిజిస్ట్రేషన్లకు వ్యతిరేకంగా గిరిజనులు అర్ధనగ్న ప్రదర్శన చేసి గురువారం నిరసన వ్యక్తంచేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించారు. బూరిగ, చినకోనేల గ్రామాలకు భూములపై విచారణ చేపట్టేందుకు తహసీల్దార్ వి. మాణిక్యం, సిబ్బందితో కలిసి వెళ్లారు. అయితే, గ్రామాల్లో గిరిజనులు అందుబాటులేరు. మరోవైపు భూములపై కలెక్టర్, సబ్‌కలెక్టర్ సమక్షంలోని విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ జగ్గయమ్మ, శంకరరావు, వీఆర్వో రాంబాబులున్నారు.

ఆశ కార్యకర్తలకు మెడికల్ కిట్లు పంపిణీ


మెడికల్ కిట్లు అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరురూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అమెరికన్ ఇండియా ఫౌండేషన్ , హెల్త్ డిపార్టుమెంట్ సంయుక్తంగా సమకూర్చిన మెడికల్ కిట్లను కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా మాట్లాడుతూ అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హుకుంపేట, అనంతగిరి మండలాల్లో 50 గ్రామాలను ఎంపిక చేసి ఆయా ఆశా కార్యకర్తలకు మెడికల్ కిట్టు పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా 14 మంది ఆశాలు ముందుగా ఈ కిట్లు అందిచామన్నారు. గ్రామాల్లో ప్రజలకు దగ్గు, జలుబు, జ్వరం, గాయాలు, కడుపునొప్పి, రక్తహీనత తదితర వ్యాధులకు సంబంధించిన మందులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, డీఆర్‌వో పద్మలత, మాన్సి ప్రోగ్రాం మేనేజర్ శ్రీకృష్ణ పాల్గొన్నారు.

చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలి

శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి


మాట్లాడుతున్న శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

హుకుంపేట/ దుంబ్రిగుడ నవంబరు 29 (ఆంధ్రజోతి): గిరిజన యువతీ యువకులు వివాహాల కంటే చదువుకే ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు పాల్గొన్నారు. ముందుగా పిల్లలు రక్తంలో హెచ్‌బీ శాతం ఎంత ఉంది.. వారి ఆరోగ్య పరిస్థితిని నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ బాల్య దశలో వివాహాలతో జీవితాలు పాడుచేసుకోవద్దని హితవు పలికారు. 15 ఏళ్లలోపు పెళ్లిళ్ల చేసుకుంటే అనేక అనర్థాలుంటాయన్నారు. తల్లిదండ్రులు బలవంతంగా పెళ్లి చేయడానికి ప్రయత్నిస్తే 100 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. అనంతరం రంగశీల పంచాయతీ టీటీ వలస గ్రామాన్ని పీవో, డైరెక్టర్ సందర్శించారు. గ్రామస్థులకు బాల్య వివాహాలపై అనర్థాలను వివరించారు. ఈ కార్య క్రమంలో శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారి సూర్యలక్ష్మి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయప్రద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా మహిళ శిశు సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.100 కోట్లు నిధులు కేటాయించినట్టు రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం, వేణుగోపాల్ రెడ్డి తెలిపారు శుక్రవారం దుంబ్రిగుడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు, బలింతలకు అందిస్తున్న స్నాక్ పరిశీలించారు సంబంధిత అధికారులు, ఐటీడీపీ పీవో అభిషేక్‌తో కలిసి సీమంతాలు నిర్వహించి అభినందించారు, ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ చిన్నయిదేవి, జిల్లా అధికారి సూర్యలక్ష్మి సినిపివో నీలమ్మ ఆధికారులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో దొంగలు హల్‌చల్

ఒకే రాత్రి మూడు చోట్ల చోరీ.. స్థానికులు భయాందోళన


ఓ దుకాణంలో చిందరవందరగా చేసిన సామగ్రి

ముంచంగిపుట్టు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఏకంగా మూడు షాప్‌ల్లో చోరీకి పాల్పడ్డారు. మరో రెండు షాప్‌ల్లో చోరీకి విఫల యత్నం చేశారు. శుక్రవారం ఉదయం షాప్‌లను తెరిచేందుకు యజమానులు వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. రాత్రీ పగలు తేడా లేకుండా పోలీసులు గస్తీతోపాటు, విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నా మూడు షాప్‌ల్లో చోరీలు జరగడం చర్చనీయాంశంగా మారింది. స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలోని టైలరింగ్ షాప్‌లో గురువారం అర్ధరాత్రి దొంగలు తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించారు. చీరలు, డ్రస్ మెటీరియల్‌తో పాటు పలు రకాల వస్తువులను ఎత్తుకుపోయారు. సా మగ్రి చిందర వందర చేశారు. ఉదయం చోరీ జరిగినట్టు గుర్తించినట్టు షాప్ యజమాని ఈశ్వరి అన్నారు. అలాగే స్థానిక నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని ఇంటితో కలిపి ఉండే రెండు షాప్‌ల తాళాలు పగల గొట్టి నిత్యావసరాలు, ఇతర సామగ్రి అపహరించుకుపోయారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బీరువా తెరచి వెండి వస్తువులను తీసుకుపోయినట్టు రెండు షాప్‌ల యజమానులు రమేష్, మద్ది శ్రీను తెలిపారు. నాలుగు రోడ్ల కూడలి సమీపంలోని మరో రెండు షాప్‌ల్లో చోరీకి యత్నించారు. తలుపులు తెరుచుకోకపోవడం, కుక్కలు మొరగడంతో అక్కడ నుంచి దొంగలు జారుకున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. వరుస చోరీలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ఘనంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం


రుద్రాభిషేకంలో భక్తులు

పాడేరురూరల్, నవంబరు 29(అంధ్ర జ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా పట్టనంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయం లో శుక్రవారం రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం విజయవంతంగానిర్వహించారు. అర్చకులు రామంపంతులు భక్తులతో రుద్రాభిషేక పూజలను చేయించారు. మహిళలు ఆకాశదీపాలను వెలిగించారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు...

ఆలయ ఆధ్యాత్మిక సేవా సంఘం ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి రామారావు, భాగ్యలక్ష్మి దంపతులు శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి వారికి ప్రత్యేక పూజలను భక్తి పూర్వకంగా చేపట్టారు. గురుస్వామి వెయ్యాకుల సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పకు పూజలను చేపట్టారు. అనంతరం స్వాములకు ఆలయ ప్రాంగణంలో సద్ది ఏర్పాటు చేశారు.

ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

డీపీవో లవరాజు


పాడేరులో వర్తకులకు నోటీసులందిస్తున్న డీపీవో లవరాజు, ఎంపీడీవో డేవిడ్‌రాజు

పాడేరురూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబరు 1వ తేదీ నుంచి జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం పాడేరులో శుక్రవారం జరిగిన వారపు సంతలో ప్రచారాన్ని చేపట్టారు. షాపులకు వెళ్లి షాపు యజమానులకు ప్లాస్టిక్ సంబంధిత కవర్లు, పేపర్లు తదితర వస్తువులు అమ్మకాలు చేపట్టవద్దని నోటీసులు జారీ చేశామన్నారు. ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, ఈవో (పీఆర్‌ఆర్‌డీ) ఆర్‌వీఎస్ రమేశ్, సచివాలయాల సెక్రటరీలు, డిజిటల్ ఆపరైటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటో తేదీనుంచి పాలిథిన్ కవర్లు నిషేధం

గూడెంకొత్తవీధి: మండలంలో డిసెంబరు ఒకటి నుంచి పాలిథిన్ కవర్లు నిషేధిస్తున్నట్టు స్థానిక ఈవోఆర్‌డీ పాపారావు తెలిపారు. శుక్రవారం పెదవలస వారపు సంతలో వ్యాపారులు, వినియోగదారులకు ప్లాస్టిక్ సామగ్రి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈవోపీఆర్‌డీ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఒక్కసారి వినియోగించి పారేసే ప్లాస్టిక్ సామగ్రిని పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. వ్యాపారులు పాలిథిన్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలక్రిష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలి

టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

జి.మాడుగుల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమం, అభివద్ధి పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయాలని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి ఆదేశించారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నిల హామీలో భాగం గా సూపర్ సిక్స్ పథకాల అమలులో అధికారులు నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రజా సమస్యలపై దృష్టిసారించాలన్నారు. అనంతం పార్టీ నేతలతో మాట్లాడుతూ, సభ్యత్వాల నమోదు, వాటి లబ్ధిని కార్యకర్తలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, కె.కల్యాణం, నాయకులు అప్పలరాజు, కొండబాబు, కృష్ణమూర్తి, నాగబ్బాయి, చిరంజీవి నాయడు, ఆర్.కొండబాబు, పెంటయ్య అధికారులు పాల్గొన్నారు.

అలరించిన అంబేడ్కర్ జీవితంపై నాటిక ప్రదర్శన


సంఘం శరణం గచ్ఛామి నాటికలో ఓ సన్నివేశం

సీలేరు, నవంబరు 29 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు ఏపీ జెన్‌కో కళ్యాణమండపంలో అభ్యుదయ ఆర్ట్ అకాడమీ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న అంబేడ్కర్ జీవిత చరిత్రపై సంఘం శరణం గచ్ఛామి ప్రదర్శించిన నాటిక అలరించింది.సీఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతా రాంబాబు, మోతుగూడెం కోశాధికారి వీవీ రమణ, సీలేరు సీఐటీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్‌కే సుభాన్ వారి ఆధ్వర్యంలో ఈ నాటిక ప్రదర్శించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి ఏపీ జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్‌పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఇంజినీర్లు, కార్మిక సంఘాల నా యకులు, కార్మికులు , కాంట్రాక్టు కార్మికులు, నాటిక ప్రాజెక్టు డైరెక్టర్ జగ్గరాజు, టీం లీడర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణ


జోలాపుట్టులో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జోలాపుట్టులో అయ్యప్ప సేవా పీఠం ఆధ్వర్యంలో శక్రవారం మహా అన్న ప్రసాదం వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు పీఠంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నప్రసాదం పంపిణీ వద్ద ఏర్పాటు చేసిన హుండీని వేలం వేయగా, లంతాపుట్టుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నీలకంఠ పాత్రోరూ.80,100కు దక్కించుకున్నారు. గురు స్వాములు సంబంగి సూరిబాబు, పొడుగు గుప్తేశ్వరరావు, సీహెచ్.రాంబాబు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు


రాజ్‌మా పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నంద్ తదితరులు

పెదబయలు నవంబరు 29 (అంధ్యజ్యోతి):రాజ్‌మా సాగులో రైతులు మెలకులు పాటిస్తే అధిక దిగుబడిని పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్.నంద్ తెలిపారు. శుక్రవారం మండలంలో గల ముసిడిపుట్టు, పెదబయలు, తమరడా, చంపాపుట్టు, అర్లాబు, పొయిపల్లి గ్రామాల్లో రాజ్‌మా పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. విత్తన సంస్థ జిల్లా మేనేజర్ నాగసాయిచ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు అనూష, శైలజ, శివలింగం, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థుల విజ్ఞాన యాత్ర


కుండలు తయారీని పరిశీలిస్తున్న విద్యార్థులు

పాడేరురూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని భారతీయ విద్యా కేంద్రం విద్యార్థుల విజ్ఞాన యాత్ర శుక్రవారం విజయవంతంగా జరిగింది. ముందుగా విద్యార్థులను ఉపాధ్యాయులు స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లో ఉన్న ఏకే 47, సాధారణ తుపాకులు, ఎయిర్ గన్ తదితర ఆయుధాలు, వాటి వినియోగంపై పోలీసులు అవగాహన కల్పించారు. చట్టాలు, కేసులు, శిక్షలు తదితర అంశాలపై సీఐ జీనబంధు, ఎస్‌ఐ సూర్యనారాయణ విద్యార్థులకు వివరించారు. అనంతరం మండలంలోని నక్కలపుట్టు వెళ్లి కుమ్మర్ల కుండల తయారీ చేసే పద్ధతిని చూపించారు.

ఫ్రైడే డ్రైడేతో పరిసరాలు పరిశుభ్రం: ఎంపీడీవో


సచివాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎంపీడీవో కుమార్, సిబ్బంది

అనంతగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఫ్రైడే డ్రైడేలో భాగంగా శు క్రవారం ఎంపీడీవో ఏవీవీ.కుమార్ ఆధ్వర్యంలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. సచివాలయాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్య క్రమంలో భాగస్వామం చేయాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రంతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలోని జనసేన మండల అధ్యక్షుడు చిట్టం మురళీ, జేఏసీ నాయకుడు రవీంద్ర, కార్యదర్శి దేవా, తదితరులు పాల్గొన్నారు.



చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రావణి

చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

» అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

మాడుగుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు చెక్‌పోస్టు వద్ద విధులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి ఆదేశించారు. శుక్రవారం తాటిపర్తి పోలీసు చెక్‌పోస్టును ఆమె పరిశీలించారు. మైదాన ప్రాంతాలకు గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాకు తావివ్వకుండా, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అన్ని వేళలా నిఘా పెట్టాలని సూచించారు. వాహనాల తనిఖీపై మరింత దృష్టిసారించాలని సిబ్బందికి ఆదేశించారు. ఇక్కడి సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. డీఎస్పీ వెంట మాడుగుల ఎస్ఐ నారాయణరావు ఉన్నారు.

పాల సేకరణ ధర పెంచాలని ఆందోళన



వెంకయ్యగారిపేట కేంద్రం వద్ద నినాదాలు చేస్తున్న సంఘ సభ్యులు, రైతులు

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాల సేకరణ ధర పెంచి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణ పరిధిలోని వెంకయ్యగారిపేట విశాఖ డెయిరీ పాలసేకరణ కేంద్రం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పాడి రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ పాడి రైతుల కష్టాలు అర్థం చేసుకుని డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధర పెంచాలని కోరారు. లేనిపక్షంలో ధర పెంచేవరకూ దశలవారీ ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విశాఖ డెయిరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేశారు.

ఘనంగా గౌరీశ్వరస్వామి రథోత్సవం

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయంలో మాస శివరాత్రి సందర్భంగా రథోత్సవం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రథోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణంలోని పురవీధుల్లో నిర్వహించిన ఈ రథోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, గూనూరు ప్రభాకర్, సేనాపతి శ్రీనివాసరావు, నేమాల హరి తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గిరిజనుల రహదారి కష్టాలు తీరుస్తాం

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు



చలిసింగం గిరిజనులతో సమస్యలపై చర్చిస్తున్న పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చలిసింగం గిరిజనుల రహదారి కష్టాల త్వరలో తీరనున్నాయని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. రావికమతం మండలంలోని చలిసింగం గిరిజన గ్రామాన్ని శుక్రవారం సందర్శించి గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఇబ్బందులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లానని, అటవీ శాఖ అడ్డంకులు తొలగించి రోడ్డు నిర్మాణానికి అంగీకరించారని చెప్పారు. త్వరలోనే అటవీ శాఖ, పీఆర్ అధికారులు ఈ రోడ్డుపై జాయింట్ సర్వే నిర్వహిస్తారన్నారు. అలాగే తాగునీటి సమస్యకు కూడా పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బలిజ మహరాజు, కొత్తం అప్పారావు, శివశంకర్, పరమేశ్, పిల్ల అప్పలనాయుడు, సూర్య, స్వామి, రమణ, కిశోర్, దొరాబు, ఈశ్వరరావు, మోహన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన సర్వేకు రైతులు సహకరించాలి

చీడికాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పశుగణన సర్వే చేస్తున్న సిబ్బందికి రైతులు సహకరించాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకుడు చిట్టినాయుడు కోరారు. మండలంలోని జైతవరం గ్రామంలో పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ, పశుగణనపై ఆధారపడి రానున్న రోజుల్లో ఉచిత టీకాలు, మందులు, పథకాలు అందించనున్నట్టు చెప్పారు. మండలంలో 3073 ఇళ్లను సర్వే చేసినట్టు ఆయన తెలిపారు. ఇంటింటికీ వస్తున్న సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. సిబ్బంది మూర్తి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పశుగణన సర్వేను తనిఖీ చేస్తున్న ఏడీ చిట్టినాయుడు

సీపీఎం మహాసభలు విజయవంతం చేయండి

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 20 నుంచి 22వ తేదీ వరకు నర్సీపట్నంలో మహాసభలు జరుగుతాయన్నారు. నర్సీపట్నంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మునిసిపాలిటీ జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు లేరన్నారు. పట్టణంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి తగిన సిబ్బందిని నియమించాలని, స్మార్ట్ మీటర్లు విరమించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందో..!

» చెరకు తూనిక కేంద్ర భవనాలు శిథిలం

» సిబ్బంది, రైతుల్లో భయంభయం

» పట్టించుకోని ఫ్యాక్టరీ యాజమాన్యం

రావికమతం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరకు తూనిక కేంద్ర భవనాలు శిథిలావస్థకు చేరాయి. శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండడంతో ప్రమాదం భరితంగా మారాయి. ఈ భవనాలు ఏ క్షణంలోనైనా కూలిపోతాయో.. ఏ ముప్పు వాటిల్లుతుందోనని రైతులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు.

మండల కేంద్రంలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అనుసంధానంగా ఐదు దశాబ్దాల క్రితం చెరకు తూనిక కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కాటా నుంచి రావికమతం, గర్నికం, గుమ్మాళ్లపాడు, మేడివాడ, పి.పొన్నవోలు, మట్టవానిపాలెం, పిల్లవానిపాలెం, మరుపాక, గొల్లలపాలెం, కొమ్మళ్లపూడి, బుదిరెడ్లపాలెం, గంటికొర్లం, పొట్టిదొరపాలెం తదితర 15 గ్రామాలకు చెందిన ఫ్యాక్టరీలో సభ్యులైన రైతులు పండించిన సుమారు 20 వేల టన్నుల చెరకును షుగర్ ఫ్యాక్టరీకి సరఫరా చేస్తుంటారు. చెరకు తూకం చేసే కాటా భవనం సుమారు 55 ఏళ్ల క్రితం నిర్మించినది కావడంతో బీటలు వారిపోయింది. అలాగే గోడల్లో మొక్కలు మొలిచాయి. శ్లాబు నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. చెరకు తూకం చేసేందుకు బండ్లు కాటాపైకి వెళ్లే సమయంలో ఈ భవనం గోడలు కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ సిబ్బంది విధులు కొనసాగిస్తున్నారు. అలాగే ఫ్యాక్టరీ ద్వారా వచ్చే ఎరువులను ఇక్కడ రైతులకు అందించేందుకుగాను నిర్మించిన గొడౌన్ కూడా బీటలు వారి ప్రమాదకరంగా ఉంది. ఇక సిబ్బంది విశ్రాంతి కోసం నిర్మించిన భవనానికి కూడా ఇదే పరిస్థితి. ఎటువంటి ప్రమాదం జరగక ముందే ఫ్యాక్టరీ యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని రైతులు, సిబ్బంది కోరుతున్నారు.





శిథిలావస్థలో ఉన్న రావికమతం చెరకు తూనిక కేంద్ర భవనం.. గోడలు బీటలు వారిన కాటా ఎరువుల గోదాం



శ్లాబ్ పెచ్చులు ఊడుతూ ప్రమాదకరంగా తయారైన విశ్రాంతి భవనం

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీలలో నర్సీపట్నం గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. నవంబరు 14 నుంచి 17 వరకు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల గురుకుల పాఠశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి స్పోర్ట్స్, గేమ్స్ పోటీలలో 40 మంది విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి తెలిపారు. సీనియర్స్ విభాగంలో త్రో బాల్‌లో ప్రథమ స్థానం, వాలీబాల్‌లో ద్వితీయ స్థానం, జూనియర్స్ విభాగంలో వాలీబాల్‌లో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు.

ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్న ఎస్.శృతి వంద మీటర్ల పరుగులో స్వర్ణ పతకం, లాంగ్ జంప్‌లో రజత పతకం, 200 మీటర్ల పరుగులో రజత పతకం సాధించిందని తెలిపారు. జూనియర్స్ విభాగంలో 8వ తరగతి విద్యార్థినులు కె.హరిణి 400 మీటర్ల పరుగులో స్వర్ణ పతకం, ఎస్.గోపీమాధురి రజత పతకం, 200 మీటర్ల పరుగులో ఎం.కావ్య కాంస్య పతకం, 800 మీటర్ల పరుగు పోటీలో సీహెచ్.స్వర్ణ కాంస్య పతకం, 1500 మీటర్ల పరుగు పోటీలలో ఆరో తరగతి విద్యార్థిని ఎస్.దీన కాంస్య పతకం సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా పీడీ ఎన్. సావిత్రీదేవి, పీఈటీ కె.మల్లమ్మలను ప్రిన్సిపాల్ అభినందించారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన గురుకుల విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

కలప అక్రమ రవాణాదారులపై అధికారుల కొరడా

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

రావికమతం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మర్రివలస పాండవుల కొండలో అక్రమ కలప రవాణాపై రెవెన్యూ అధికారులు కొరడ ఝుళిపించారు. ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్న కలపను శుక్రవారం స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. మండలంలో మర్రివలస రెవెన్యూ పరిధిలోని 212 సర్వే నంబర్లలో ఉన్న పాండవుల కొండపై కలపను రెండు వారాలుగా ఓ వైసీపీ ప్రజాప్రతినిధి అండతో కొంత మంది నరికి తరలించుకుపోతున్నారు. కొండపైకి యంత్రాలతో రహదారి నిర్మించి ఏపుగా పెరిగిన నేరేడు, టేకు, అకేషియా తదితర చెట్లను నరికి ట్రాక్టర్లతో తరలించుకుపోతుండంపై గ్రామస్థులు అటవీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అధికారులు ఉదాసీన వైఖరితో ఉండంతో అక్రమార్కులు యథేచ్ఛగా కలప నరికి తరలించుకుపోతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి శుక్రవారం ప్రచురించిన కథనానికి తహసీల్దార్ బి.వెంకట రమణ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ సతీశ్, వీఆర్వో లక్ష్మి, సిబ్బంది వెళ్లి అక్రమంగా తరలిస్తున్న కలప, ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకుని కొత్తకోట పోలీసులకు అప్పగించారు. దీంతో కలప అక్రమ రవాణాదారులపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే కొండపైకి ఎలాంటి వాహనాలు వెళ్లకుండా రాత్రికి రాత్రే ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్‌లు తవ్వించారు.



కలపతో పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

కాపీ రైటింగ్ పుస్తకాల పంపిణీ

రావికమతం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకవానిపాలెం పాఠశాల విద్యార్థులకు వైస్ ఎంపీపీ మత్సభవానీప్రసాద్ సొంత నిధులతో సమకూర్చిన కాపీ రైటింగ్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 62 మంది విద్యార్థులకు సరిపడా పుస్తకాలను హెచ్ఎం శ్రీనివాసరావుకు అందజేశారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బి.రాము పాల్గొన్నారు.

బీమా పాలసీలపై జీఎస్టీ తొలగించాలని నిరసన

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎల్ఐసీ ఏజెంట్లు శుక్రవారం ఎల్ఐసీ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అలాగే ఏజెంట్లకు రూ.2 లక్షల వరకు మెడిక్లెయిమ్ వర్తింపజేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ 85 సంవత్సరాల వరకూ ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి ఏజెంట్ల సంఘం ప్రతినిధులు ఎం.నాగరాజు, మోహనరావు, అప్పలనాయుడు, నూకరాజు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలి

చీడికాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో అందరికీ సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని ఎంపీడీవో హేమసుంద్రరావు సూచించారు. మంచాల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. 38 మందికి తనిఖీ చేశామని ఏఎన్ఎం రాజేశ్వరి తెలపడంతో, ఇంత తక్కువమంది రావడానికి కారణమేమిటని ఆరా తీశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. మంచాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లు, ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. మంచాల పంచాయతీ కార్యదర్శి ఎం.వనిత తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో తుఫాన్ అలజడి

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వాతావరణం

పొలాలకు పరుగులు.. వరి పనలు కాపాడుకునే ప్రయత్నాలు

మాకవరపాలెం/రావికమతం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు వీస్తతండడం రైతుల్లో అలజడి మొదలైంది. మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చూసి పొలాలకు పరుగులు తీస్తున్నారు. కొంత మంది వరి కోతలు మొదలుపెట్టగా, మరి కొందరు తుఫాన్ పోయే వరకు చూస్తామని చెప్పారు. ప్రధానంగా రెల్లిరాల్చు పురుగు తెగులు రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. మాకవరపాలెంలో మండలంలోని మల్లవరం, గిడుతూరు, తామర, మాకవరపాలెం, కొండలఅగ్రహారం, బయ్యవరం గ్రామాల్లో అక్కడక్కడ కోసిన పంటను కుప్పలు వేశారు. ఈదురుగాలులు వేయడంతో చాల చోట్ల వరిపంట కిందపడిపోయింది. ఈ ఏడాది తెగుళ్ల బెడద తీవ్రంగా దెబ్బతీసింది. అయితే వారం రోజుల కిందటే వరికోతలు కోసేందుకు రైతులు వరి పొలాల్లో అపరాలు విత్తనాలు చల్లారు. ఇప్పుడు తుఫాన్ కారణంగా కోతలు ఆగిపోవడంతో అపరాల విత్తనాలు మళ్లీ చల్లాలని రైతులు చెబుతున్నారు. రావికమతం మండలంలో నీటి వనరులు ఉన్నచోట రైతులు ముందుగా నాట్లు వేశారు. ఈ పంట కోతలు కోసి కొంత మేర కుప్పలుగా పెట్టారు. శుక్రవారం ఉదయం నుంచి మబ్బులతో చల్లబడి చిరుజల్లులు పడడంతో వరికోత కోసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ వరి పండినా కోతలు కోయవద్దని చెబుతున్నా, రెక్కరాల్చు పురుగు ఉధృతం కావడంతో పండిన పంట నేలరాలిపోతుందన్న బాధతో రైతులు కొంత మంది రైతులు కోత కోసి మడుల్లోనే ఆరబెట్టారు. ఈ వర్షం అధికమైతే తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.



మత్స్యపురంలో పొలంలోనే ఆరబెట్టిన వరి పనలు

ఎస్ఐ, పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసలు

కృష్ణాదేవిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఎస్పీ తుహిన్‌సిన్హా శుక్రవారం ప్రశంసించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఓ కారులో రూ.12 లక్షల 50 వేల నగదుతో ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి గంజాయి కొనాలని ప్రయత్నించారు. పోలీసుల నిఘా అధికంగా ఉండడంతో ఎక్కువ మోతాదులో గంజాయి రవాణా చేయలేమని భావిస్తూ 25 కిలోల గంజాయిని రూ.లక్షా 25 వేలకు కొనుగోలు చేశారు. దారి ఖర్చులు పోనూ మిగిలిన రూ.11 లక్షల ఆరు వేలను ఎవరికీ అనుమానం రాకుండా బ్యాగ్‌లో పెట్టి తమ కారు ఇంజన్ భాగంపైన బోనెట్ కింద అమర్చి, గంజాయిని కారు వెనక డిక్కీ అడుగు భాగంలో పెట్టి బయలుదేరారు. రొంపుల ఘాటీ నుంచి తనిఖీలు తక్కువ ఉంటాయని భావించి వారు రాజమండ్రి వైపు వెళ్తుండగా కేడీ పేట, అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న కేడీ పేట పోలీసులు వీరిని పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి పట్టుకోవడంతో పాటు అత్యధికంగా నగదును సీజ్ చేసిన కృష్ణాదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బంది విశ్వేశ్వరరావు, ఆంజనేయులు, అప్పారావు, చిరంజీవి, సతీశ్, గోవిందరావు, నాయుడులను ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అభినందించారు.



ఎస్ఐకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

దేవరాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తిమిరాం ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాస శివరాత్రి సందర్భంగా స్వామి వారికి రుద్రాభిషేకం, గోపూజ నిర్వహించారు. పుర వీధుల్లో గోమాతను ఊరేగించారు. అలాగే వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు భజనలు చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. పురోహితులు పాకల కామేశ్వరరావు శర్మ పూజలు చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు.



తిమిరాంలో గోమాతను ఊరేగిస్తున్న భక్తులు

పశువులకు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

నాతవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు వ్యాధులు రాకుండా రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పశు సంవర్థక శాఖ అధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని జిల్లేడిపూడి గ్రామంలో శుక్రవారం పశుగర్భకోశ చికిత్సా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సీజన్‌లో పాడి పశువులకు ఏ వ్యాధులు వస్తాయో ముందుగా తెలుసుకోవాలని సూచించారు. గర్భకోశ చికిత్స వల్ల ఎదకు రాని పశువులను గుర్తించి ఎదకు వచ్చేలా వైద్యం చేయించాలని చెప్పారు. అలాగే ఆడదూడల పెంపకంపై పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో నాతవరం మండలంలోనే శృంగవరం, నాతవరంలో పశువైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ అధికారి చంద్రశేఖర్, అసిస్టెంట్ వెటర్నరీ అధికారి రాంబాబు, వైద్యులు నూకేశ్, మోక్షరెడ్డి, అంకంరెడ్డి అబి, ఎల్.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాదరావు

జుత్తాడలో మహాలింగార్చన

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జుత్తాడలోని మల్లికార్జున స్వామి ఆలయంలో శుక్రవారం మహాలింగార్చన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులంతా భక్తిశ్రద్ధలతో 390 మట్టిశివలింగాలు తయారు చేసి ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. స్థానికుల సహకారంతో వేదపండితులతో పూర్ణాహుతి హోమం, అన్నసమారాధన కార్యక్రమాలతో పాటు దీపోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

1న సుపథ ప్రతిభా పరీక్షలు

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటలు నుంచి సుపథ ప్రతిభా పరీక్షలు నిర్వహించనున్నట్టు సపథ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాంతీయ అధ్యక్షుడు వైవీ.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, మాతృ భాషా సంరక్షణకు సంస్థ పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగా పద్య, శ్లోక పఠనం, దేశ భక్తి గేయాలు, ప్రశ్నోత్తర రామాయణం తదితర అంశాలపై విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. విజేతలకు డిసెంబరు 25న పాలకపాడు గురుదేవుల ఆశ్రమంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

పశుగణన ఆకస్మిక తనిఖీ

మాడుగుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోటపాడులో నిర్వహిస్తున్న పశుగణన సర్వేను పశు సంవర్థక శాఖ పాడేరు డీడీ సిహెచ్.నరసింహులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి పశు వైద్య సిబ్బందిని సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 11 మంది ఎన్యుమనేటర్లు 4905 ఇళ్లను సర్వే చేశారన్నారు. మిశ్రమ దాణా, గడ్డి కత్తిరించే యంత్రాలు, గడ్డి పెంపకంపూ రైతులకు సిబ్బంది అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండండి

రావికమతం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులు సెల్‌ఫోన్లలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం.శ్రీనివాస్ సూచించారు. కొత్తకోట జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కళాశాలకు విద్యార్థులు సెల్‌ఫోన్లు తీసుకొస్తే అధ్యాపకులు కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ఎదురు తిరిగే విద్యార్థిపై తమకు సమాచారం అందిస్తే తల్లిదండ్రులతో మాట్లాడి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రిన్సిపాల్ సత్యవతి మాట్లాడుతూ కళాశాలలకు విద్యార్థులు సెల్‌ఫోన్లు తీసుకు రావద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. ఇందుకు విద్యార్థులు సహరించాలని కోరారు.

జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

దేవరాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన కురమాన శ్రావణి జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైంది. ఈనెల 25, 26 తేదీలలో ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలలో శ్రావణి ప్రతిభను చాటింది. ఆమె ఆట తీరును గుర్తించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపిక కమిటీ ఆమెను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసిందని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సీహెచ్.భువన మాధురి తెలిపారు. బాలికకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.కుమారి, సిబ్బందిని ఆమె అభినందించారు.



శ్రావణి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

వరి కోతలు వాయిదా వేసుకోండి

కె.కోటపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రత తగ్గేవరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు. మండలంలో గుల్లేపల్లి, చౌడువాడ, మేడిచర్ల, ఆర్‌వై అగ్రహారం, కె.కోటపాడు గ్రామాల్లో శుక్రవారం పొలాలకు రైతులతో మాట్లాడారు. నూర్పులు పూర్తయితే ధాన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. కుప్పలు తడవకుండా టార్పాలిన్లు, లేఆ ప్లాస్టిక్ గోనెలతో కప్పుకోవాలన్నారు. వరి చేను తడిచి గింజ రంగు మారకుండా ఉండడానికి 50 గ్రాముల గళ్ల ఉప్పును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు.

మాడుగులలో చిరు జల్లులు

మాడుగుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ ప్రభావం వల్ల శుక్రవారం చిరు జల్లులు కురి శాయి. మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 11 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. వారం రోజుల్లో కోతలు కూడా జోరందుకోగా, చాలా వరకు పొలాల్లోనే ఉంది. తుఫాన్ ప్రభావంతో చేతికందే పంట నీటి పాలవుతుందేమోనని రైతులు భయాందోళన చెందుతున్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

రోలుగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దళిత కాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు మాట్లాడుతూ రాజ్యాంగ హక్కులపై అందరికీ అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ, వీఆర్వో, స్థానిక దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గవరవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థుల రక్త నమూనాలు, బరువు, ఎత్తు, ఇతర శారీరక అంశాలకు సంబంధించిన వివరాలు సేకరించి హెచ్ఎం వీవీ.శేషగిరిరావుకు అందజేశారు.

దూసుకుపోతున్న... ఫెమి రైడ్స్

ప్రస్తుత సమాజంలో మహిళలు బయటకు అడుగు పెట్టాలంటేనే భయం వెంటాడుతోంది. ఇంటా బయటా మహిళలకు రక్షణ లేకుండా పోతున్న పరిస్థితుల్లో వారికి భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందించాలని సంకల్పించారు నగరానికి చెందిన రాధికా బెహరా. ఆలోచన వచ్చిందే తడవుగా 'ఫెమి రైడ్స్' పేరుతో సంస్థను స్థాపించారు. ఒంటరిగా మహిళలు ప్రయాణించాల్సిన సందర్భాల్లో మహిళా రైడర్లే వారిని గమ్యస్థానాలకు చేర్చేలా ఔత్సాహికులను ప్రోత్సహించారు. బైక్, ఆటో, కారు డ్రైవింగ్‌లో తర్ఫీదునివ్వడంతో పాటు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ వ్యవస్థను దేశంలోనే ప్రథమంగా నగరంలో అందుబాటులోకి తీసుకువచ్చి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రయాణికులు, డ్రైవర్లూ మహిళలే...

- స్త్రీలకు శిక్షణ, ఉపాధి కల్పిస్తున్న సంస్థ
- దేశంలోనే మొదటిగా నగరంలో ప్రారంభం
- ప్రయాణంలో మహిళల భద్రతే ధ్యేయంగా ఏర్పాటు





నారీమణులు ఎన్ని విజయాలు సాధించినా సమాజ సంకెళ్లు వారిని వెనక్కి లాగుతూనే ఉన్నాయి. ఉద్యోగం, వ్యాపారంలో రాణించాలనుకునే వారిని ప్రోత్సహించే వారి కన్నా...నిరుత్సాహపరిచే వారే ఎక్కువ. అయితే రాధికా బెహరా ఇవేవీ పట్టించుకోలేదు. ప్రయాణ సమయంలోనైనా ఆడపిల్లలకు రక్షణగా నిలవాలన్న ఆలోచనలో నుంచి ఫెమి రైడ్స్‌కు రూపకల్పన చేశారు. ఇక్కడ ప్రయాణికులు, డ్రైవర్లు మహిళలే...ఔత్సాహిక మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణను అందించి, ఉపాధి కల్పించడం, సురక్షిత ప్రయాణం అందించడమే ఫెమి రైడ్స్ లక్ష్యం. ఎన్‌జీవో సంస్థలో మేనేజర్‌గా పనిచేసిన రాధికా బెహరా మహిళలను డ్రైవర్లుగా మార్చి, కేవలం మహిళా ప్రయాణికులకు మాత్రమే రవాణా సదుపాయం కల్పించాలని వినూత్న ప్రయత్నం చేశారు. ఈ ఏడాది మార్చిలో మధురవాడ, పెందుర్తి, గాజువాక ప్రాంతాల్లో ఫెమి రైడ్స్ సంస్థ ప్రారంభించారు. ఓలా, ఊబర్ మాదిరిగా కార్లు, ఆటోలు, బైక్‌ల ద్వారా మహిళా రైడర్లతో మహిళలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నారు. ఇందుకు ఎలక్ట్రికల్ వాహనాలు మాత్రమే వినియోగిస్తున్నారు.

మహిళలకు శిక్షణ... ఉపాధి

మహిళలు డ్రైవింగ్ చేయడమంటే కుటుంబ సభ్యులే కాదంటారు. ఈ నేపథ్యంలో వారిని నియమించే ప్రయత్నం చేయడంతో పెద్దగా స్పందన కనిపించలేదు. అప్పుడే రాధికా బెహరా మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తామంటూ సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేశారు. దీంతో డ్రైవింగ్ నేర్చుకోవడానికి పదుల సంఖ్యలో మహిళలు ఆసక్తి చూపించారు. దరఖాస్తు చేసుకున్నవారి ఆసక్తి మేరకు కారు, ఆటో, బైక్ డ్రైవింగ్‌లో శిక్షణ అందించారు. అనంతరం ఫెమి రైడ్స్‌లో రైడర్లుగా ఉపాధి కల్పించారు. ఇప్పుడు 30 మంది మహిళలు కార్లు, ఆటోలు, బైక్‌లు నడుపుతూ మహిళలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు కుటుంబానికి ఆర్థిక ఆసరాగా కల్పిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో బుకింగ్..

మహిళా డ్రైవర్ల కోసం మహిళలు మాత్రమే ఫెమి రైడ్స్ వెబ్‌సైట్‌లో సంప్రతించాలి. వెబ్‌సైట్ ఓపెన్ చేసి కారు, బైక్, ఆటో ఏది ఎంపిక చేసుకుంటే దగ్గర్లో ఉన్న మహిళా రైడర్లు వారిని పికప్ చేసుకుని గమ్యస్థానాలకు చేర్చుతారు. తాజాగా యాప్ కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. దేశంలోనే మహిళల కోసం ఇలాంటి రవాణా సదుపాయం కేవలం విశాఖ నగరంలోనే అందుబాటులోకి రావడం విశేషం.



హైదరాబాద్, ముంబై, బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా తదితర నగరాల్లో మహిళా డ్రైవర్లు ఉన్నప్పటికీ వారు అందరికీ రవాణా సేవలందిస్తున్నారు.

- విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి

మహిళలు ముందుకురావాలి..



మహిళా రైడర్లతో మహిళలకు మాత్రమే రవాణా సదుపాయం కల్పించడం కోసం ఫెమి రైడ్స్ ఏర్పాటుచేశాం. రాష్ట్రంలోని ఇతర నగరాల్లో ఇలాంటి రవాణా కోసం ఫ్రాంచైజ్ కావాలని సంప్రతిస్తున్నారు. బ్యాంకులు కూడా వాహనాల కొనుగోలుకు రుణాలు ఇచ్చేందుకు ముందుకువస్తున్నాయి. నగరంలో డ్రైవింగ్ ఉద్యోగాలకు మహిళలు ఆసక్తి చూపడం లేదు. స్త్రీలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడానికి మహిళలే ముందుకు రావాలి. ఎవరు వచ్చినా డ్రైవింగ్ నేర్పించి పార్ట్‌టైం లేదా ఫుల్ టైమ్ జాబ్ చేసుకునే అవకాశం కల్పిస్తాం.

- రాధిక బెహరా, ఫెమిరైడ్స్ ఫౌండర్

డ్రైవింగ్‌పై ఇష్టంతో శిక్షణ తీసుకున్నా...



ఉద్యోగం కోసం వెతుకుండగా సోషల్ మీడియాలో ఫెమి రైడ్స్ యాడ్ చూసి సంప్రతించాను. డ్రైవింగ్ మీద ఇష్టంతో శిక్షణ తీసుకుని, ఉద్యోగంలో చేరాను. రాపిడోలో చాలా మంది ఆడవారు బైక్‌లను బుక్ చేసుకుని ఇబ్బందిగా ప్రయాణిస్తున్నారు. ఫెమి రైడ్ ద్వారా అలాంటి వారిని పికప్ చేసుకుని డ్రాపింగ్ చేయడం సంతృప్తినిస్తోంది. నెలవారీ సంపాదనతో కుటుంబ ఆర్థిక పరిస్థితి కుదుటపడుతోంది.

- కె.రమ్య, బైక్ రైడర్

ఏమనుకుంటారోనని భయపడ్డా



డ్రైవింగ్ అంటే ఇష్టం. ఫెమిరైడ్స్‌లో కార్ డ్రైవింగ్ నేర్పించి ఉద్యోగం ఇచ్చారు. ఎవరు ఏమంటారోనని భయపడ్డాను. కానీ ఏమనుకున్నా జాబ్ చేయాలని నిర్ణయించుకున్నాను. ఆడవారు ఎక్కడికైనా వెళ్లాలంటేనే భయపడుతున్నారు. సాయంత్రం మహిళలను పికప్ చేసుకుని వెళుతుంటే చాలా ఆనందంగా ఉంటోంది.

- ఎస్.భాగ్యలక్ష్మి, డ్రైవర్

సంతృప్తికరంగా ఉంది



ఒంటరి మహిళలు వాహనాల్లో ప్రయాణానికి భయపడుతున్నారు. మహిళా డ్రైవర్లుగా గమ్యానికి చేర్చడం సంతృప్తి కలిగిస్తోంది. ప్రతిరోజూ చాలా మంది స్త్రీలను పికప్ చేసుకుని వెళ్తున్నా. వారంతా సురక్షితంగా ప్రయాణిస్తున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు రక్షణతో కూడిన ప్రయాణమే కాకుండా సంపాదన మెరుగుపడుతుంది. నా సంపాదనతో కుటుంబ అవసరాలు తీరుతున్నాయి.

- సోను, క్యాబ్ డ్రైవర్

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు



వెదుళ్లనరవ సర్వే నంబరు 118లోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 24న 'ప్రభుత్వ భూములకు రెక్కలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. శుక్రవారం జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని వెదుళ్లనరవలో పర్యటించి సర్వే నంబర్లు 118, 102, 77/2లలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, సహాయ సర్వేయర్ లోకేశ్‌లు సర్వే నిర్వహించి హద్దులు గుర్తించగా. ఆర్ఐ బి.వీరయ్య, వీఆర్వో గోవింద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

పంచాయతీల్లో డిజిటల్ సేవలు

- జనవరిలో ప్రారంభం: డీపీఓ

తుమ్మపాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో జనవరి నుంచి డిజిటల్ సేవలను ప్రారంభిస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలు ఎక్కడి నుంచి అయినా సేవలను పొందే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆస్తి పన్ను చెల్లింపు, వ్యాపార లైసెన్సులు, భవన నిర్మాణానికి అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువపత్రాలు పొందవచ్చునన్నారు. 'స్వర్ణ పంచాయతీ'లో భాగంగా ప్రభుత్వం డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుందని చెప్పారు.

బాల్య వివాహాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు

పాడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం బాల్య వివాహాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలకు సంబంధించి చేపట్టిన చర్యలు, భవిష్యత్తు కార్యాచరణపై ప్రతి నెలా డివిజన్, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. వాటి వల్ల కలిగే నష్టాలపై గిరిజనుల్లో అవగాహన కల్పించాలని, బాలికల సంక్షేమం, అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు బాల్య వివాహాల నియంత్రణపై పక్కాగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ రాధ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వ కేంద్రాల కోసం 43 దరఖాస్తులు

అనకాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరు ఇసుక నిల్వ కేంద్రాల ఏర్పాటుకు సీల్డ్ కవర్లలో టెండర్లు స్వీకరించగా, 43 మంది పోటీ పడ్డారు. జిల్లాలోని నదుల్లో ఎక్కడా ఇసుక రీచ్‌లు నిర్వహించేందుకు తగినన్ని ఇసుక నిల్వలు లేవు. దీంతో ఇసుక రీచ్‌లకు అనుమతి ఇవ్వలేదు. కేవలం స్థానికంగా వ్యక్తిగత భవన నిర్మాణాలకు మాత్రమే అవసరం మేరకు నదుల్లో ఇసుక సేకరణకు అనుమతులు ఇచ్చారు. దీంతో భవన నిర్మాణ రంగానికి ఇసుక కొరత సమస్య ఏర్పడింది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు జిల్లాలో ఆరుచోట్ల ప్రైవేటు వ్యక్తులకు టెండర్ల ద్వారా ఇసుక నిల్వ కేంద్రాలను కేటాయించడం ద్వారా నిర్దేశించిన ధరలకు నిర్మాణ రాంగాలకు ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. టెండర్ల ప్రకటన విడుదల చేసి శుక్రవారం వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రానికి జిల్లాలో ఆరు ఇసుక నిల్వ కేంద్రాల కోసం 43 మంది టెండర్లు వేశారు. ఇందులో అనకాపల్లి ఇసుక నిల్వ కేంద్రం కోసం 11, అచ్యుతాపురానికి 9, చోడవరానికి 3, నక్కపల్లికి 10, నర్సీపట్నానికి 8, మాడుగులకు సంబంధించి రెండు దరఖాస్తులు దాఖలయ్యాయి. డిసెంబరు ఒకటి లేదా రెండో తేదీన కలెక్టర్ సమక్షంలో టెండర్లను తెరిచి ఇసుక నిల్వ కేంద్రాలను కేటాయించనున్నట్టు గనుల శాఖ జిల్లా అధికారి మజ్జి శ్రీనివాసరావు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే మద్యం షాపుల లైసెన్సులు రద్దు

- బెల్టు షాపులను ప్రోత్సహిస్తే క్రిమినల్ చర్యలు
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డీసీ హెచ్చరిక



మద్యం దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ డీసీ శ్రీరామచంద్రమూర్తి

సబ్బవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల విషయంలో నిబంధనలను అతిక్రమిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి హెచ్చరించారు. ఆయన శుక్రవారం మండలంలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. మద్యం ధరల పట్టీలు, సీసీ కెమెరాల పనితీరు, మద్యం విక్రయాల రికార్డులు, తదితర వాటిని పరిశీలించారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని, ప్రభుత్వం సరఫరా చేసిన మద్యాన్ని మాత్రమే అమ్మాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. ఉదయం 10 గంటలకు ముందు, రాత్రి 10 తరువాత మద్యం షాపులు తెరవొద్దని, గ్రామాల్లో బెల్టుషాపులకు వేలం పాటలు నిర్వహించినా, బెల్టుషాపులు ఏర్పాటు చేసినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్, ఎస్ఐ వీవీ రమణ, సిబ్బంది వున్నారు.

సౌత్ జోన్ పురుషుల హాకీ పోటీలకు ఏయూ జట్టు ఎంపిక



అంతర్ విశ్వవిద్యాలయాల సౌత్ జోన్ హాకీ పోటీలకు ఎంపికైన ఏయూ జట్టు క్రీడాకారులు

నక్కపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల హాకీ పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున పాల్గొనే పురుషుల జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం నక్కపల్లిలో నిర్వహించారు. స్థానిక టీఎస్ హాకీ మైదానంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య, పీడీ కె.దుర్గారావు, ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.విజయ్ మోహన్, ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ ఎ.పల్లవి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. విశ్వవిద్యాలయం పరిధిలోని పలు కళాశాలలకు చెందిన ఏఎస్‌వీ సాయిబాబు, బాస్కర్, సత్యనారాయణ, డీవీ నారాయణ, టీ.గణపతి, ఎ.వెంకటేశ్, వినయ్, పి.సంతు, పీఎస్‌వీ దుర్గారోహిత్, జె.శ్రీరాములు, బి.కోదండరావు, రాయి కుమార్, దత్తాత్రేయ, కౌశిక్, బి.ఉదయ్ కుమార్, జి.ప్రశాంత్, వై.దుర్గాప్రసాద్, సీహెచ్ పవన్ శేఖర్ ఎంపికయ్యారు. డిసెంబరు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు చెన్నైలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో ఏయూ తరఫున వీరు పాల్గొంటారు.

నేడు అనంత పద్మనాభుని దీపోత్సవం

పద్మనాభం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పద్మనాభంలోని అనంత పద్మనాభుని దీపోత్సవం శనివారం నిర్వహించనున్నారు. కొండ దిగువన తొలి పావంచా వద్ద సాయంత్రం ఐదు గంటలకు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఏటా కార్తీక బహుళ అమావాస్య రోజున దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పద్మనాభుని కొండపై వరకు ఉన్న మెట్లకు ఇరువైపులా ప్రమిదలలో నూనె వేసి ఒక్కసారిగా దీపాలను వెలిగించడం ప్రత్యేకత. సాయంత్రం నాలుగు గంటలకు కుంతీ మాధవస్వామి ఆలయంలో ఉన్న ఉభయ దేవేరులతో కూడిన అనంతుడుని వేద పండితులు మంత్రోచ్చారణలతో, పల్లకిపై ఊరేగింపుగా ప్రథమ పావంచా వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై అధిష్ఠింపజేస్తారు. అనంతరం విశేష అర్చనలు చేసి భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు కొండపై జేగంట కొట్టగానే అప్పటికే మెట్లపై ఏర్పాటుచేసిన నూనె దీపాలను భక్తులు వెలిగిస్తారు.

గ్రామీణ రోడ్లకు కొత్తరూపు

... 5వ పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 'పల్లె పండగ' పేరుతో రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్‌పేట రోడ్డులో సామిల్లు వరకు సీసీ రోడ్డుతోపాటు డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో స్థానికులు, ఈ మార్గంలో రాకపోకలు సాగించే పలు పంచాయతీల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, కొత్తూరు జంక్షన్ నుంచి సా మిల్లు వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామని, మిగిలిన రోడ్డును బీటీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

నర్సీపట్నంలో వాటర్ స్పోర్ట్స్

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని సూచించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో షెడ్లు వేసి చిన్నపాటి దుకాణాలను ఏర్పాటు చేసుకోవచ్చునని అన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, పెద్ద చెరువులో ఏడాది పొడవునా నీరు వుంటుందని, వాటర్ స్పోర్ట్స్‌కు ఇబ్బంది వుండదని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పరంగా సహాయ, సహకారాలు అందిస్తామని, త్వరితగతిన డీపీఆర్ సిద్ధం చేయాలని అన్నారు. అనంతరం బలరామ్ నాయుడు ఇరిగేషన్ ఏఈ రామన్నపాత్రుడు, మునిసిపల్ కమిషనర్ సురేంద్రతో కలిసి పెద్ద చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు.

పేదల కష్టాలు తీర్చడానికి ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

పంపించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని చెప్పారు. కాగా ప్రజా దర్బార్‌లో కొత్త పెన్షన్లు, రేషన్ కార్డుల మంజూరు కోసం, కుటుంబ, ఆరోగ్య సమస్యలు, శాంతి భద్రతలు, భూ సమస్యలు, పక్కా గృహాలు, మద్యం బెల్టుషాపులు తదితర అంశాలకు సంబంధించి వినతులు అధికంగా వచ్చాయి. నక్కపల్లి మండలానికి సంబంధించి రెవెన్యూ పరిధిలో 144, నాన్ రెవెన్యూ 179, ఏపీఐఐసీ భూములకు సంబంధించి 116 వినతులు వచ్చాయి. పాయకరావుపేట మండలంలో రెవెన్యూకు సంబంధించి 32, ఇతర ప్రభుత్వశాఖలకు సంబంధించి 59, ఎస్.రాయవరం మండలంలో రెవెన్యూ 53, ఇతర సమస్యలు 85, కోటవురట్లలో రెవెన్యూకు 23, ఇతర సమస్యలకు సంబంధించి 34 వినతిపత్రాలు అందాయి. వీటిలో కొన్నింటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పరిష్కరించారు. పలు శాఖల అధికారులతోపాటు కూటమి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

క్రైం... crime news

ముగ్గురి అరెస్టు.. ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, నిందితులతో సీఐ ధనుంజయరావు, ఎస్ఐ సావిత్రి, పోలీసు సిబ్బంది

ఎలమంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సీఐ ధనుంజయరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

ఎలమంచిలికి చెందిన కె.భాను. వి.సుబ్రహ్మణ్యం. నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం గ్రామానికి చెందిన బి.శివనాగు జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నారు. వీరి కదలికలపై నిఘా వుంచిన పోలీసులు శుక్రవారం ఎలమంచిలి సమీపంలోని కొత్త ఎర్రవరం పోలిమేరమ్మ ఆలయ వద్ద అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇవి ఎలమంచిలి, తుని, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో చోరీ చేసినట్టు పోలీసులు గుర్తించారు. వీటి విలువ సుమారు 5 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. భాను, సుబ్రహ్మణ్యంలపై గతంలో పలు స్టేషన్‌లలో కేసులు నమోదై ఉన్నాయని, నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించామని సీఐ చెప్పారు.

12 కిలోల గంజాయితో ఐదుగురి అరెస్టు

ఎస్.రాయవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అడ్డరోడ్డు జంక్షన్ వద్ద 12 కిలోల గంజాయితో ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. కడప ప్రాంతానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ఏవోబీలోని ధారకొండ ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అడ్డరోడ్డు వద్ద నిఘాపెట్టిన పోలీసులు నర్సీపట్నం వైపు నుంచి వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేశారు. ఐదు ప్యాకెట్లలో వున్న 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఎస్.రాయవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్టుగోళ్లపల్లి గ్రామానికి చెందిన మల్లు స్రవంతి అనే యువతి కనిపించడం లేదని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్రవంతి ఈ నెల 27వ తేదీన బయటకు వెళుతున్నట్టు కుటుంబ సభ్యులకు చెప్పి, సాయంత్రం అయినా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట డెన్‌పై దాడి.. ఐదుగురి అరెస్టు

మాకవరపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పేకాట స్థావరం దాడి చేసి బైకులు, కార్లతోపాటు ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం గిడుతూరు గ్రామానికి దూరంగా ఉన్న మామిడితోటలో పేకాట ఆడుతున్నట్టు స్పెషల్‌బ్రాంచ్ పోలీసులకు సమాచారం అందడంతో దాడి చేశారన్నారు. ఈ సందర్భంగా పేకాట స్థావరం వద్ద 11 బైకులు,రెండు కార్లు, 65 వేల రూపాయల నగదుతోపాటు ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. బైకులతోపాటు కార్లను పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు.

కారు బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

జి.మాడుగుల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పర్యాటకులకు సంబంధించిన కారు బంధవీధి మలుపు వద్ద అదుపు బోల్తా పడింది. దీనికి సంబంధించి స్థానికులందించిన వివరాలివి.. కాకినాడ ప్రాంతానికి చెందిన కొందరు శుక్రవారం జి.మాడుగుల నుంచి వంజంగి ప్రాంతానికి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589